

# శ్రీ సాయి దర్శన్


సాయి ప్రబోధ ప్రచార మాసపత్రిక

| సంపుటి-7 | మే - 2008 | సంచిక 6 |
|---|---|---|

## SRI SAI DARSHAN

*(SaiPrabhodha Prachar Monthly)*



Editor : **Raojee**

Associated Editor : **A. Lakshmi**



**Subscription Rates**

| | |
|---|---|
| Maharaja Poshakulu | Rs.1,501-00 |
| Life Membership (20 Yrs) | Rs.751-00 |
| For 3 Years | Rs.275-00 |
| For 1 Year | Rs.100-00 |

M.O's / DD's may be drawn in favour of



**SRI SAI DARSHAN**
Dammaiguda, Nagaram Post,
Hyderabad - 500 083.
Phone : 040-65640220
Cell : 98667 48099
e-mail : srisaidarshan@rediffmail.com
Website : www.srisaidarshan.org.in


**శ్లో॥ త్యజే జ్ఞాన నిర్మాల్యం**
**సోహంభావేన పూజయేత్**
**అభేదదర్శనం జ్ఞానం**
**ధ్యానం నిర్విషయం మనః ॥**

**తా॥ అజ్ఞానమనే వాటిని పూలను తొలగించాలి. ఆ భగవంతుడే నేననే భావంతో పూజించాలి. ఏకత్వ దృష్టే అసలయిన జ్ఞానం. మనస్సులో ఆలోచనలు లేకుండా ఉంచుకోవడమే ధ్యానం.**

# విషయసూచిక


సంపాదకీయం............................................................3
శ్రీసాయిసద్గురు సమర్థ-సగుణోపాసన..................................4
ఆనాటి బాబా భక్తుల అనుభవాలు......................................5
సాయికి పద్యకుసుమాంజలి.............................................8
శ్రీసాయిబాబా జన్మరహస్యం.............................................9
వార్తలు..................................................................14
బాలాజీ వసంత తాలీం..................................................17
పిలిచిన పిలుపే విశ్వవిఖ్యాతి గాంచిన వేళ.........................19
శ్రీవాసుదేవానంద సరస్వతీ (తెంబే స్వామి)............................25
జ్ఞానముత్యాలు..........................................................28
ప్రేమామృతసాగరుడు.....................................................33
సాయి అభయప్రదాత.....................................................39
సోదరి....................................................................42
శిలధిపుర నివాస సాయినాథ............................................47
శ్రీశ్రీశ్రీగణేశ్‌నాథ్ మహారాజ్ సాయిబాబాకు చేసిన ప్రసంగం.......48
సాయినాథ ఉవాచ.......................................................52
ఆధ్యాత్మిక సంపద.......................................................59
ధ్యానసాధన..............................................................61
శ్రీలలితా సహస్రనామములు.............................................62
అష్టగణపతి క్షేత్రములు ................................................64
మహాత్ముల సూక్తులు....................................................68




శ్రీసాయినాథాయనమః

ఆసేతు హిమాచల పర్యంతం ఈనాడు భారతదేశం శ్రీసాయిబాబా సందేశామృతము, అతిశక్తివంతమై, అత్యద్భుతమై దివ్యౌషధంగా పనిచేస్తుంది. శ్రీసాయి వివిధమతాల మూల సూత్రాలనాచరించే మానవులు ఎలా కలిసి మెలసి సుఖశాంతులతో జీవించగలరో ప్రత్యక్షంగా, ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు.

సమస్త ప్రాణులకు ప్రీతిపాత్రుడు, మిత్రుడు, ఆధారభూతుడైన దేవదేవుని పాదపద్మములను శరణువేడి జీవిత సాఫల్యాన్ని పొందగలము. పంచేంద్రియాల మాయాజాలంలో కొట్టిమిట్టాడేవారు, నిరంతరానందాన్ని, ఆశీస్సుల నందించే పరమాత్ముని చేరలేరు.

మనోవాక్కాయకర్మలతో సద్గురుని పాదపద్మాలను మనం శరణం వేడటం, సమస్త పాపపరిహారణకై సతతము వారి నామోచ్ఛరణ చేయటం ఒక్కటే మిక్కిలి ఉత్తమ మార్గం. మన మనస్సు ప్రశాంతచిత్తాన్ని పొందితే మనం శరణాగతి ఫలాన్ని పొందినట్లే. ఈ శరణాగతి ఫలం మనకు శుభసూచకం. దీని ననుసరించి మనకు సద్భక్తి, విజ్ఞానం లభిస్తాయి.

# శ్రీసాయిసద్గురు సమర్థ-సగుణోపాసన

మూలం :- శ్రీకృష్ణారావ్ జోగేశ్వర్ భీష్మ అనుసరణ : నైనారు అప్పాస్వామి

రెండవ భాగం- మధ్యాహ్నఆరతి 12.00 గంllలు

**1. పంచముఖదీప ఆరతి**

**శ్రీసాయిబాబాకు ఆరతి**

*శ్రీబాబాకు ఆరతిస్తాను*
*పంచముఖ దీప ఆరతిస్తాను.*
*అందరికి ఆనందమొసగు*
*శ్రీసాయిబాబాకు మేము ఆరతిస్తాము*
*అట్టడగు వారలకు*
*మీ పాదపద్మాల నాశ్రయించిన వారలకు*
*అభయమిమ్మో దేవ ! శ్రీసాయినాథా !*
*మేము ఆరతిస్తాము.*

*1. మా కోరికల కాల్చి*
*ముముక్షువులకెల్ల*
*మోక్షమార్గంబు దెల్పుమో దేవా !*
*శ్రీరంగనాథుని దర్శింపగానిమ్ము*
*వారి నేత్రాలతో వీక్షింపనిమ్ము*
*ఓ శ్రీరంగనాథా ! ఓ సాయిదేవా!*
*మేము ఆరతిస్తాము.*

*2. వారి వారి శ్రద్ధాధ్యాసల మేరకు*
*తగిన అనుభవంబొసగెదవు దేవా !*
*ఓ కరుణాంతరంగా !*
*మీ దైన మార్గంబిదియేను సాయీ !*
*మేము ఆరతిస్తాము.*

*3. మీ నామ జప మది తొలగించు*
*నందరి సంసార బాధలను దేవా !*
*మీ కార్య మగాధమో సాయీ !*
*దురదృష్టవంతులకు*
*దారిజూపుమో సాయినాథా !*
*మేము ఆరతిస్తాము.*

*4. ఈ కలియుగమందున*
*మీరు నిజముగ బ్రహ్మావతారులు*
*సశరీరులై మీరు భువికి వచ్చారు*
*దత్తదిగంబర స్వామివో సాయీ !*
*ఓ దత్తావతారా ! మేము ఆరతిస్తాము.*

*5. వారానికోమారు గురువారమందు*
*మీ పాద పద్మాల దర్శించి, లౌకికభయాల*
*తొలగించుకొనుటకై దేవా!*
*షిరిడీకి వస్తారు భక్తులందరు శ్రీసాయిదేవా!*
*మేము ఆరతిస్తాము.*

*6. నేను కోరెడి ఏకైక ధనమెల్ల*
*మీ పాదసేవయే సాయీ !*
*ఓ రాజాధిరాజా ! శ్రీసాయినాథా !*
*మేము ఆరతిస్తాము.*

*7. స్వచ్ఛమగు నీటినే త్రాగు*
*చాతకపక్షివలె ఓ సాయిదేవా !*
*నాకు నేరుగా జ్ఞానంబు నిమ్ము*
*దయతోడ నభయంబు నిమ్ము*
*అట్టి జ్ఞానంబు నే బడయునట్లు*
*అభయంబు నిమ్మో సద్గురు సాయీ !*
*మేము ఆరతిస్తాము.*



# ఆనాటి బాబా భక్తుల అనుభవాలు

'అమృతధార' ఆనాటి శ్రీ షిరిడీసాయిబాబా భక్తుల అనుభవాలు ఆంగ్లమూలం శ్రీ బి.వి.నరసింహస్వామీజీ, తెలుగు అనువాదం శ్రీతోట భాస్కరరావు, ప్రచురణ : శ్రీ షిరిడి సాయిబాబా మందిరము, కొవ్వాడ

## శ్రీమతి ప్రధాన్ అనుభవములు

మా పిల్లలందరికి 'ఆటలమ్మ' (మీజిల్స్) వచ్చెను. డాక్టరుగారు మా 'బాబు' విషయంలో నిస్స్రృహతోనున్నారు. పిల్లలందరినీ పరిస్థితి అలాగుననేయున్నది. నేను సాయిబాబాను ప్రార్థించితిని. ఆయన నాకు కనిపించి "ఏల ఏడ్చుచున్నావు? పిల్లవాడు బాగుగానేయున్నాడు. ఉదయమే 6 గంటలకు మంచి ఆహారము యియ్యుము". ఆ ఉదయమే పిల్లవాడు లేచి ఆడుకొను చుండెను. డాక్టరుగారు చూసి ఆశ్చర్యముతో "పిల్లవానికి ఆహారము ఏమి యియ్యవద్ద"నెను. కాని బాబా చెప్పినట్లు మంచి ఆహారము యియ్యగా, పిల్లవాడు శుభ్రముగా తిని జీర్ణించుకొనెను.

ఒక రాత్రి 11 గంటల సమయంలో బాబా నాకు కనిపించి "ఏమిటి? నిద్రపోవుచుంటివా ? లెమ్ము మీ పిల్లవానికి వంకరలు పోవు వ్యాధి వచ్చెను. నేను వెంటనే లేచి పిల్లవాడిని చూడగా జ్వరముగాని, ఇతర ఏ విధమైన లక్షణములు కానరాలేదు. అయినను ముందు జాగ్రత్త చర్యగా వేడినీరు, నిప్పు, తైలము అన్ని తయారుగా యుంచితిని. సుమారు రాత్రి 2 గంటలకు పిల్లవాడు లేచి వంకరలు తిరుగుచుండెను. మా పిల్లలందరికీ అప్పుడప్పుడు ఈ వ్యాధి వచ్చుచుండెను. నేను అన్నీ సిద్ధముగా యుంచుకొనుటచే అరగంటలో పిల్లవాడి జబ్బు తగ్గిపోయెను. ఆ విధముగా బాబా నన్ను ముందుగా

హెచ్చరించి మమ్ములను అపాయమునుండి రక్షించెను. ఇలా ఎన్నోసార్లు జరిగెను.

మనసులోని ఆలోచనలను బాబా గ్రహించి వాటికి సరియైన సమాధానములు తానే యిచ్చుచుండెను. నేను ఒకసారి బాబా మశీదులో కోపముతో గట్టిగా అరుచునేమో అనుకొంటిని (అప్పుడప్పుడు బాబా యీ విధముగా అరుచుచుండెను.) కాని ఆ రోజు బాబా నా ఆలోచనలను గ్రహించి యీ విధముగా అనెను. "చూడుము. ఈ రోజు నేను ఎవరిపైనా కోపముతో అరవలేదు కదా !"

ఒకసారి మశీదులో నేను పూజచేయుచుండగ మధ్యలోనే బాబా నన్ను వాడకు పొమ్మనెను. వాడాలో పిల్లవాడు ఏడ్చుచున్నాడు. వానిని సముదాయించి తిరిగి మశీదుకు వచ్చితిని. బాబా అపుడు నన్ను పూజచేసుకోనిచ్చెను. వాడాలో పిల్లవాడు ఏడ్చుచున్నది బాబాకు ముందుగానే తెలిసినది.

ఒకసారి మా డాక్టరుగారు టైఫాయిడ్ జ్వరముచే నుండి అప్పుడే కోలుకొన్న మా బాలుని షిరిడీకి తీసుకువెళ్ళరాదనెను. కాని మేము మా బాబుని తీసుకొని షిరిడీకి పయనించితిమి. రైలులో బాబా ఆరోగ్యము చెడెను. మేము చేసిన పనికి తోటి ప్రయాణికులు నవ్వుదురేమో అనుకొంటిని. పిల్లవాడు లేచి కూర్చొనలేక పోవుచున్నాడు. మేము షిరిడీచేరి బాబా వద్దకు వెల్ళగనే లేచి నిలుచొనగలగెను. అప్పుడు బాబా యీ విధముగా అనిరి, "జనులు మిమ్ములను చూసి నవ్వరు". మేము రైలులో మనసులో అనుకున్న విషయం బాబా గ్రహించెను.

18-10-1918 అనగా బాబా సమాధి చెందిన రాత్రి నేను కలలో



చనిపోయిన బాబా దేహము చూసి "బాబా చనిపోవుచున్నారు" అంటిని. దీనికి బాబా "సాధువులు చనిపోయిరి అనకూడదు, వారు సమాధి చెందిరి అనవలెను" అని చెప్పెను. ప్రజలంతా దుఃఖసాగరములో మునిగియున్నారు. ఈ కల వచ్చినవెంటనే నేను లేచాను. అప్పుడు రాత్రి గం॥ 12.30 ని॥ అయినది. మరుసటి రోజు ఉదయం, అన్నా చించినీకర్ వద్ద నుండి మాకు జాబు వచ్చినది. బాబా 15-10-1918 దశరారోజు మధ్యాహ్నము 3 గంటలకు సమాధిచెందిరని.

మరుసటి రాత్రి 19-10-1918 నాకు తిరిగి కలవచ్చెను. బాబా నాకు 3 రూపాయలు యిచ్చినట్లు కలవచ్చెను. కలలో ధనము వచ్చుట శుభసూచకము కాదు. బాబా ఈ విధముగా అనెను. "తీసుకొనుము. ఈ 3 రూపాయలు తీసుకుని, నీవు నీ పెట్టెలో దాచిన ధనమంతయు నా కిమ్ము" నేను వెంటనే మేల్కొని నావద్ద నున్న ధనమంతయు బాబా అంత్యక్రియలకోసమై పంపివేసితిని. అదే రాత్రి నా వదినగారికి బాబా కలలో కనిపించి పసుపురంగు పట్టుపీతాంబరము సమాధిపై నుంచుటకు పంపమనెను. ఈ ఆదేశము కూడా నెరవేర్చబడినది.

నేను ప్రసవించురోజు అతి దగ్గరలో నున్నది. మా యింటివద్ద నా కోసము ఒక నర్సు మరియొకరు నియమింపబడ్డారు. నాలుగు రోజులు నొప్పులు వస్తున్నను ప్రసవము కానందున నర్సు కంగారుపడి డాక్టరును వెంటనే పిలువవలసిందిగా నా సోదరితో చెప్పెను. కాని నా సోదరి, నర్సు తన ప్రక్కనుండగా బాబా పటమును పూజింపసాగితిని. ఇట్లు ప్రార్థిస్తుయుండగా నాకు ఎవ్వరి సహాయము లేకుండగనే సుఖప్రసవము జరిగెను. బాబా యొక్క శక్తి, కారుణ్యము కొనియాడితిమి. ▯



# సాయికి పద్యకుసుమాంజలి

'కవిచంద్ర' **వేదగిరి వేంకట నరసింహరాయశర్మ,** యం.ఎ., బి.ఇడి.,
జానకమ్మపేట వయా పెద్దపవని - 523 115, ప్రకాశం జిల్లా.



కం ॥ శివుఁడవొ ? కాకున్నను, మా
ధవుఁడవొ ? యెఱుగంగఁ జాల ! దాక్షిణ్యనిధీ !
భువి జనులను దరిఁ జేర్చెడు
భవసాగర కర్ణధారి ! ప్రార్థింతు నెదన్ ॥

ఉ॥ కూయిడు భక్తవర్యులక కుంఠితప్రేమఁ దలిర్ప నిచ్చలున్
చేయిడి బ్రోచు వాడవని చేరి ముదంబున ప్రస్తుతింతునో
సాయి ! మహానుభావ ! గుణసాగరపూర్ణశశాంకమూర్తి ! నీ
సాయముఁ గోరుచుంటి మనసార! తపోధన ! మాటిమాటికిన్ ॥

మ॥ అరయన్ నేరనివాడ బాలుఁడ ! మహాత్మా ! మూర్ఖచిత్తుండ, నీ
వరివస్యాంకిత బుద్ధి మా కొసగుమా ! వాంఛింపఁ బోనన్యమున్
కరుణాపూర సుధా తరంగిత కటాక్షశ్రీలచే నొప్పు, నీ
చరణాంభోజము లాశ్రయించితి । నమస్కారంబు సాయిప్రభూ ।

కం॥ కరుణావరుణాలయ । నీ
చరణైకాశ్రయుఁడ కృపకుఁ జాలినవాడన్
శరణంటిని కరుణింపుము
షిరిడీశ ! మహానుభావ ! చేసెదను నీతుల్ ।


కం॥ నీవే । జగదాధారము
పావన శుభనామ । పాపభంజన । సాయీ ।
రావయ్య । మమ్ము బ్రోవగ
ధీవినుతా । యోగమూర్తి । దీనోద్ధారా ।



# శ్రీసాయిబాబా జన్మరహస్యం

**సాయిదాసానుదాసు సురేంద్రబాబు,** కొవ్వూరు, నెల్లూరు జిల్లా

## దాసగణు రూపకల్పన చేసిన సేలూ కథ




బాబా పుట్టుకను గూర్చి ముఖ్యంగా రెండు కథలు బహుళ ప్రచారంలో వున్నాయి. మొదటిది దాసగణు మహరాజ్ తమ "భక్తి సారామృత్" అను గ్రంథంలో పేర్కొన సేలూ కథ. బాబా తాము సేలు నుండి వచ్చామని, తమ గురువు పేరు "వెంకూసా" అని చెప్పిన మాటలు ఆధారంగా తీసుకుని, దాసగణు సేలు వెళ్ళి పరిశోధనలు జరిపి, బాబా ఒక ముస్లిం దంపతులకు పుట్టిన కబీరు అవతరంగా భావించి, ఈ కథను రూపకల్పన చేసాడు.

సేలులో ఉండిన గోపాలరావు దేశ్‌ముఖ్ జింటూరు పరగణాలకు జాగీర్దారు. అతని తల్లితండ్రులు విష్ణుభక్తులు. గోపాలరావు మహావిష్ణువు వరప్రసాదంగానూ, రామానందుని అవతారంగాను, వారిని జన్మించాడు. అతని ఇష్టదైవం శ్రీవేంకటేశ్వరుడు. తమ ఇష్టదైవమైన వేంకటేశ్వరునితో ప్రత్యక్షంగా సంభాషించే వాడని ప్రతీతి. అందువల్ల అతనిని వేంకటేశ్వరుని

ప్రతిరూపంగా భావించి, 'వెంకూసా' అని ప్రేమతో పిలిచేవారు. వేంకటేశ్వరుని యొక్క వాడుక నామమే 'వెంకూసా'.

ఇతడొకసారి అహ్మదాబాదలోని దర్గాః దర్శించడానికి వెళ్లాడు. ఇతనిని చూచిన వెంటనే దర్గాః (ముస్లిం మహాత్ముల సమాధి) సంతోషంతో స్పందించి, క్రిందివిధంగా మాట్లాడసాగింది. "సలామ్, అలేకుమ్ ! నిన్ను నేను గుర్తించాను. పూర్వజన్మలో నీవు రామానందునివి. నన్ను మరువకుండ చూడటానికి వచ్చినందుకు సంతోషం. నీ శిష్యుడు కబీరు, మానవత్ గ్రామంలో ఫకీరుబిడ్డగా జన్మించాడు. త్వరలోనే నిన్ను కలిసికోగలడు" అని చెప్పింది. గోపాలరావు దర్గాకు కృతజ్ఞతలర్పించి, సేలూ వెళ్ళిపోయాడు. మరుసటి రోజు మానవత్ గ్రామం నుండి ఫకీరు భార్య ఒకామె 5 సం॥ల వయస్సున్న బిడ్డతో వచ్చి, గోపాలరావును దర్శించింది. తన భర్త చనిపోయాడని, చనిపోయేముందు తమ బిడ్డను, వెంకూసా సంరక్షణలో వదలమని చెప్పారని, తనకెవ్వరు దిక్కులేరని, బిడ్డను స్వీకరించమని దీనంగా వేడకుంది. గోపాలరావు ఆ బిడ్డను సువాగ్సా దర్గా చెప్పిన కబీరుగా గుర్తించి, బిడ్డను, తల్లిని చేరదీశారు. కొంతకాలానికి తల్లి చనిపోయింది. వెంకూసా బాలుని కన్నబిడ్డ వలె ప్రేమించి, ఆదరించాడు. ఆ బాలుడు వెంకూసానే గురువుగా భావించి, అత్యంత భక్తిశ్రద్ధలతో సేవించాడు. ఇలా కొన్ని సంవత్సరాలు గడిచాయి. గురుశిష్యుల అన్యోన్యత చూచి, వెంకూసా ఇతర శిష్యులు ఓర్వలేక, ఆ బాలుని అంతమొందించాలని నిర్ణయించారు. ఒకరోజు అడవిలో గురువు విశ్రాంతి తీసుకుంటున్నాడు. శిష్యుడు వారికి సేవచేస్తున్నాడు. ఒక శిష్యుడు ఆ బాలునిపై పెద్ద ఇటుకరాయి నొకదాన్ని విసిరాడు. ఇది గమనించిన వెంకూసా ఆ రాయిని





గాలిలోనే ఆపేశాడు. ఆ రాయి గాలిలో తేలియాడసాగింది. అష్టమహాసిద్ధులు కలిగిన వెంకూసాకు, రాయి విసిరిన శక్తికి, శాశ్వత అవరోధం కల్గించటం ఇష్టపడలేదు. అందువలన ఆ రాయి వచ్చే దిశలో తమ తలనుంచి అవరోధాన్ని తొలగించారు. ఆ రాయి వెంకూసా తలకు తగిలి ప్రాణాంతకమైన గాయం అయ్యింది. చిత్రంగా ఆ రాయి విసిరిన శిష్యుడు ఆ క్షణాన్నే క్రిందపడి మరణించాడు. ఇచ్ఛామరణం వరంగా గల గోపాలరావు మరుసటి రోజు తన దేహాన్ని త్యజించాలని నిర్ణయించాడు. తర్వాత వెంకూసా ఒక లంబాడీ దగ్గరున్న నల్ల గొడ్డావు నుండి మూడు శేర్లపాలు పితికి తెమ్మని మస్లింబాలు నాదేశించాడు. ఆ బాలుడలాగే చేశాడు. ఆ పాలలో కర్మ, భక్తి, జ్ఞానాలను రంగరించి ఫకీరుబాలునిచే త్రాగించాడు. తమ సర్వశక్తులు, సిద్ధులు కూడా బాలునికి ధారపోశారు. తర్వాత తన తలపైనున్న గుడ్డను తీసి, ఫకీరుబాలుని తలకు చుట్టి, విసరిన ఇటుకను ప్రసాదంగా ఆ బాలునికిచ్చి, ఆ చోటు విడిచివెళ్ళమని ఆదేశించాడు. ఫకీరు బాలుడు గురువాదేశానుసారం, రాయి విసిరి మరణించిన వానిని, గురుపాద ధూళితో బ్రతికించి, గోదావరి దక్షిణతీరం వెంబడి పశ్చిమంగా ప్రయాణించి, శిరిడీచేరి అక్కడ స్థిరపడ్డాడు. ఆ బాలుడే సాయిబాబా గోపాలరావు సేలూ వెళ్ళి సమాధి చెందారు. వారు సమాధి చెందే ముందు గ్రామస్థులకు చెప్పినట్లుగా, వారి సమాధి సమీపంలోని భూమిలో వెంకటేశ్వరవిగ్రహం

దొరికింది. గ్రాహస్థులు అక్కడొక ఆలయం నిర్మించి, విగ్రహాన్ని అందులో ప్రతిష్ఠించారు.

***ఈ కథ యొక్క ప్రాధాన్యత, ప్రామాణికత :***

ఈ సేలూ కథ కల్పితము, నిరాధారమని ఋజువయ్యింది. 1975లో విశ్వాస్ బి.ఖేర్ అను సాయిచరిత్రకారుడు సాయి జన్మ రహస్య భేదనకు పూనుకొని, కొన్ని పరిశోధనలు జరిపారు. గోపాలరావు దేశ్‌ముఖ్ ఆరవ తరానికి చెందిన లక్ష్మీకాంత్ మల్హరరావు అను న్యాయవాదితో సంభాషించి, గోపాలరావు జన్మించింది క్రీ.శ. 1715లోనని, నిర్యాణం చెందింది క్రీ.శ.1802లోనని తెలుసుకున్నాడు. ఈ విషయాన్ని ఋజువు చేయడానికి కావలసిన దస్తావేజులు కూడా సేకరించాడు. దీనిని బట్టి 1802లో నిర్యాణం చెందిన గోపాలరావు ఉరఫ్ వెంకూసాకు, 1838 ప్రాంతంతో జన్మించినట్లుగా భావించబడుతున్న శ్రీసాయిబాబా శిష్యుడు కావడమన్నది అసంభం కదా ! అంతేగాక గోపాలరావు సమాధి ప్రస్తుతం సేలూలో కన్పిస్తుంది. కానీ బాబా గురుసమాధి శిరిడీలో ఉన్నట్లు వారే స్వయంగా చెప్పారు. దీనినిబట్టి గోపాలరావు దేశ్‌ముఖ్ ఉరఫ్ వెంకూసా బాబా గురువుకాదని, దాసగణు వ్రాసిన సేలు కథ కల్పితమని స్పష్టమవుతుంది.

శ్రీదాసగణు మహరాజ్ ప్రప్రథమ సాయిచరిత్రకారుడు. వీరు సాయిబాబా సశరీరులుగా ఉన్నప్పుడే వారి లీలలు, మహిమలు ఆరు అధ్యాయాలలో వ్రాసి, బాబా సన్నిధిలో పోతీ (పారాయణ) నిర్వహించి, గ్రంథాన్ని బాబాకు సమర్పించాడు. బాబా "అచ్ఛా !" అని దానిని ఆశీర్వదించారు. దీనికి చాలాకాలం తర్వాత సేలూ కథను రూపకల్పనచేసి, ఏడవ అధ్యాయంగా అనుబంధించారు. ఈ ఏడు అధ్యాయాలు 'శ్రీసాయి గురుచరిత్ర' అను పేర శిరిడీ సాయిపథం ఆశ్రమం వారిచే ప్రచురింపబడింది. బాబా సన్నిధిలో పోతీ చేయబడి, వారిచే ఆశీర్వదించబడిన గ్రంథం కాబట్టి, ఇది పవిత్రంగా పరిగణించబడి, బహుళ ప్రచారం పొందింది. కానీ సేలూ కథ ఉన్న ఏడవ అధ్యాయం బాబా సన్నిధిలో పోతీ చేయబడిన భాగాలలో లేదు. దీనికి బాబా ఆమోదముద్ర కానీ, ఆశీర్వాదంకానీ లేవు. అంతే గాకుండా దాసగణు కూడ ఎంతో నిజాయితీగా తను వ్రాసిన "సేలూ కథ" అంత నిర్దుష్టమైనదికాదని ఒప్పుకున్నాడు. అందుకే ఈ సేలూ కథ ప్రాధాన్యత కోల్పోయింది.


(సశేషం)


## చందాదారులకు మనవి

**కొత్త చందాదారులకు, పాతచందా రెన్యూవల్ చేయువారికి శ్రీసాయిదర్శన్ ప్రతినెల, సం॥రం పాటు మరియు 5 ఆధ్యాత్మిక పుస్తకములు, పోకెట్ కేలండరు ఊది పంపబడును.**

**పాత చందాదారులు తమ చందా నెంబరు మనియార్డరు కూపనులో వ్రాయండి.**

**SRI SAI DARSHAN**
**Dammaiguda , Hyderabad - 500 083**




## షిర్డీ సాయికి రూ.11 కోట్లతో బంగారు సింహాసనం

హైద్రాబాద్‌కు చెందిన ఇద్దరు సోదరులు శ్రీ మహేశ్ రెడ్డి, శ్రీ గిరీశ్ రెడ్డి రూ.11 కోట్ల విలువైన స్వర్ణసింహాసనాన్ని డిసెంబర్ 20, 2007 సం॥న షిర్డీ సంస్థాన్‌కు అందజేసారు. వీరిద్దరు బిల్డర్లు. ఈ సింహాసనాన్ని బెంగుళూరుకు చెందిన అలగర్‌రాజా అను స్వర్ణకారుడు రెండున్నర నెలరోజులు శ్రమపడి తయారుచేశారు. 94 కేజీల బంగారం వినియోగించి, డిజైనుకు 35 లక్షలు ఖర్చయ్యాయి. డిసెంబరు 23వ తేదీ 2007 సం॥న దత్తజయంతి సందర్భంగా ఈ సింహాసనాన్ని వినియోగించారు.

షిర్డీసాయిబాబా బొమ్మతో రూపాయి, అయిదు రూపాయల నాణెములు త్వరలో ప్రజలకు అందుబాటులో రానున్నాయని ఆర్థిక మంత్రి శ్రీ పి.చిదంబరంగారు షిర్డీసంస్థాన్‌కు తెలిపారట.

**సేకరణ :కె.ఆర్. విజయ్‌కుమార్**
మదనపల్లి- 517 325

**చెన్నాయ్ :**

శ్రీరామనవమి రోజున శ్రీ శిరిడీసాయి సత్సంగ్‌ట్రస్టు చెన్నై అధ్వర్యంలో చందనోత్సవం, సత్సంగము, అన్నదానంతోబాటు 55మంది అనాథ పిల్లలకు స్కూలు యూనిఫారమ్‌లు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. ఆ రోజు కార్యక్రమములో 400మంది పాల్గొనినారు. సత్సంగ్ నిర్వహిస్తున్న ట్రస్టు చైర్మన్ కొంపల్లి విశ్వం భోజనాలు పర్యవేక్షిస్తున్న ట్రస్టీ ఎ.వేణు, గాయకులు జి.ఆనంద్, సాకేత్ మున్నగు వారున్నారు. **- (కొంపల్లి విశ్వం)**

**విశాఖపట్నం:**

విశాఖపట్నం, గాంధీనగర్, అరిలోవలో "శ్రీరామనవమి" సందర్భంగా



శ్రీసద్గురు సాయి చారిటబుల్ ట్రస్టు అధ్వర్యంలో పేదలు, వృద్ధులు, సాయిభక్తులకు అన్నదాన కార్యక్రమము జరిగినది. ఈ కార్యక్రమమునకు ట్రస్టు ఛైర్మన్ యస్.రాంబాబుగారు, ట్రస్టీలు శ్రీ యస్. వెంకటలక్ష్మి, యన్.రమణ, యన్.సన్యాసిరావుగార్లు మరియు సాయి భక్తబృందం పాల్గొని విజయవంతం చేసినారు. భక్తులకు శ్రీసాయిదర్శన్ మాసపత్రికలు, సాయిబాబా ఫోటోలు ఉచితముగా పంచబడినది.

**- (యస్.రాంబాబు)**

**షిరిడీ :**

శ్రీసాయిదర్శన్ చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రావూజీగారి అధ్వర్యంలో అన్నదాతల సహకారముతో శ్రీరామనవమి రోజున బీదలకు అన్నదానం మరియు సాయిభక్తులకు ద్వారకామాయి వద్ద ప్రసాద వితరణ జరిపించినారు. సాయినాథుని కృపాకటాక్షములు విరాళములు పంపినవారికి కల్గుటకు ద్వారకామాయిలో రావూజీగారిచే ప్రార్థనలు చేయబడినవి.

**నెల్లూరు :**

శ్రీనవలాక్ గార్డెన్, 4వ మైలు పెట్రోలు బంకు వద్ద మైపాడు రోడ్డులోగల శ్రీసాయి ధర్మక్షేత్రం 'శ్రీషిరిడీసాయిబాబా మందిరం'లో సద్గురు శ్రీదర్గాస్వామి దివ్యహస్తములతో శ్రీషిరిడీ సాయిబాబా నూతన విగ్రహ ప్రతిష్ఠ 30-4-2008 తెల్లవారుఝామున 4.30 ని॥ల నుండి 4.45 ని॥లకు జరిగినది. మహాకుంభాభిషేకము జరిపించినారు. మధ్యాహ్నం 12.15 ని॥లకు అన్న సంతర్పణ జరిపించినారు.

**చిత్తూరు :**

చిత్తూరు జిల్లా నిమ్మనాపల్లి తవళం గ్రామంలో 9-3-2008న శ్రీమతి గుమ్మడి కుతూహలమ్మ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకరువారి అమృత హస్తాలతో శ్రీసాయినాథుని మందిరమునకు భూమిపూజ జరిగినది. డా॥కుతూహలమ్మగారు భక్తులకు ఆశ్చర్యాన్ని కలిగించే విధంగా బాబావారి ఏకాదశసూత్రాలను,

సాయిలీలలను వర్ణించారు. సాయితత్త్వప్రచారకులు జి.సాంబమూర్తిగారు వారి బృందముతో నామసంకీర్తన పరిమతో మధురంగా ఆలపించి సాయి లీలలను పునీతం చేసినారు. ఈ కార్యక్రమమునకు పూర్తి సహకారము అందించిన సూత్రదారులు శ్రీ ఆర్. దుర్గాప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీరు, మదనపల్లి ద్వారకామాయి భజన సంఘ సభ్యురాలు శ్రీమతి బి.మనోరమగారు, శ్రీ ఇ.చంద్రశేఖర్ గారు, శ్రీమతి బి.ఆర్.ప్రసన్నకుమారి, శ్రీబొమ్మలపాటి రమేష్, యం.ఎల్.ఎ. మున్సిపల్ ఛైర్మన్ రవికుమార్ తదితరులు.

**పశ్చిమగోదావరి జిల్లా :**

తాడేపల్లిగూడెం పశుపతి నగర్‌లోగల ద్వారకామాయి సేవాసమితి అధ్వర్యంలో శ్రీవిఘ్నేశ్వర సాయి మందిరంలో గల ది.14-04-2008 నుండి 18-04-2008 వరకు శ్రీసీతారామ కళ్యాణ 20వ వార్షికోత్సవము జరుపబడినది. శ్రీకూచి శివ సుబ్రహ్మణ్య శర్మగారి బ్రహ్మత్వమున శ్రీకేశిరెడ్డి నాగవెంకటేశ్వరరావు (శ్రీను) దంపతులచే శ్రీసీతారామ కళ్యాణ మహోత్సవము జరిగినది. టి.టి.డి. ధర్మప్రచార పరిషత్ వారిచే హరికథ, బీదలకు వస్త్రదానం జరిగినది.

**హైద్రాబాద్ :**

హైద్రాబాద్ శ్రీలక్ష్మినగర్‌లోగల శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో ది.12-04-2008 నుండి 14-04-2008 వరకు శ్రీరామనవమి మహోత్సవములు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవోపేతముగా జరిగినవి. భక్తులచే శ్రీసాయిచరిత్ర పారాయణ, అర్చనలు, భక్తిసంగీత కార్యక్రమాలు, 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, ఆకుపూజ, సామూహికంగా భక్తులచే సాయి సద్గురు పాదూకావ్రతము, పల్లకీసేవ, రథోత్సవము, చందనోత్సవము,జండా ఉత్సవములు జరిగినవి.

**- (వి. సుబ్రహ్మణ్య శాస్త్రి)**




( 'సాయిభక్తమాల' అను గ్రంథము నుండి .... )

# బాలాజీ వసంత తాలీం


**చరణ్ జనమంచి**

*(గత సంచిక తరువాత భాగం)*



| | | |
|---|---|---|
| అసలు పేరు | : | బాలాజీ వసంత తాలీం |
| పిలవబడిన పేరు | : | తాలీం |
| వృత్తి | : | శిల్పి |
| జననం | : | 1888 |
| నివాసస్థలం | : | బొంబాయి |
| మరణం | : | డిసెంబర్, 25, 1970, |

షిరిడీలో సమాధి మందిరంలో ఉన్న బాబా విగ్రహం చూస్తూంటే మనం అన్ని మరచి స్పృహలేకుండా ఉంటాము. అంత గొప్పగా దానిని మలచి తయారుచేసిన శిల్పి బాలాజీ వసంత తాలీం. తాలీంకు చిన్నప్పటి నుంచి ఎంతో నేర్పుతనంతో బొమ్మలు గీయటం, చెక్కటం అలవాటు. 1918లో తాలీం ఆర్ట్‌స్టూడియో ప్రారంభించెను. తన ప్రతిభతోటి ఎన్నో ప్రశంసలు, బహుమతులు, స్వర్ణపతకాలు సంపాదించెను.



సాయిబాబా శిల్పాన్ని ఇటలీ పాలరాతితో తయారుచేశారు. ఆ పాలరాతిని ఇటలీ నుంచి ఎవరూ కొనుగోలు చేసారో తెలీదు. బొంబాయి నౌకాశ్రయంలో ఉన్న రాయి కోసం ఎవ్వరూ రాలేదు. దాన్ని వేలం వేయగా ఎవరో కొని షిర్డీ [illegible]



విగ్రహం తయారుచేయుటకు నిర్ణయించిరి. కళా తపస్వియైన తాలీంకు ఆ పని అప్పగించగా, తనకు బాబా స్వప్నంలో కనిపిస్తే ఆయన నమూనా ప్రకారం విగ్రహం చెక్కుతానని తెలిపెను. **తాలీంకు బాబా స్వప్నంలో దర్శనమిచ్చి "నన్ను మళ్లీ చూడాలంటే సాధ్యం కాదు, ఓర్పుతో చూడు"** అని అన్నారు. తాలీం సాయిబాబా చుట్టు తిరుగుతూ తన మనసులో బాబా రూపాన్ని భద్రపరచుకొని, 'ప్లాస్టర్ఆఫ్ ప్యారిస్'తో నమూనా చేసి దాని ఆధారంగా విగ్రహాన్ని మలిచాడు. విగ్రహం చెక్కటానికి దాదాపు 2 ఏళ్లు పట్టింది. దాని ఎత్తు 5 $^{1}/_{2}$ అడుగులు. 1954, అక్టోబర్, 7 విజయదశమినాడు బూటీ మందిరములో స్వామీ శరణానంద (వామనపటేల్) విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహం తూర్పుముఖంగా ఉంది.




(సశేషం)



# పిలిచిన పిలుపే విశ్వవిఖ్యాతి గాంచిన వేళ !

## మహాభక్త భగత్ మహల్సాపతి జీవిత చరిత్ర

**సాయిదాసానుదాసు సురేంద్రబాబు,** కొవ్వూరు, నెల్లూరు జిల్లా



శిరిడీలో ఉన్న ఖండోబా దేవాలయం అధిపతి పేరు ఖండోబా. ఖండోబా దేవత యొక్క మరోపేరు మహల్సాపతి. పార్వతీదేవిని మహల్సాపతి దేవి అంటారు. ఆమె పతియే మహల్సాపతి. అంటే ఈశ్వరుడే మహల్సాపతి! మహారాష్ట్రదేశంలో మహల్సాపురాణం బహుళ ఆదరణ పొందింది. మహల్సాపురాణం పారాయణం చెయ్యడం, పురాణ పఠన కార్యక్రమాలు విరివిగా ఏర్పాటుచెయ్యడం సాగించేవారు. పుట్టిన పిల్లలకు మహల్సాబాయి అని మహల్సాపతి అని పేర్లు పెట్టుకోవడం కూడా జరిగేది.

శ్రీసాయిసచ్చరిత్రలో మహల్సాపతి యొక్క ప్రస్తావన మొదట బాబా చాంద్‌పాటిల్ పెళ్ళిబృందంతో శిరిడీకి వచ్చినప్పుడు జరిగింది. బృందంతోపాటు వచ్చి బండి దిగి వస్తున్న ముస్లింఫకీరును చూచి, ఖండోబా దేవాలయపు పూజారిగా ఉన్న మహల్సాపతి, "యా ! సాయి ! (రండి సాయి)" అని ఆహ్వానించారు. మహల్సాపతి సాధారణంగా హిందూ సాధువులను "జై శ్రీరాం!" అని, ముస్లిం సాధువులను "జై సాయి!" అని సంబోధించే అలవాటు ఉంది.




అదే ప్రకారం ఈ ముస్లిం సాధువుని చూచి "రండి సాయి!" అని ఆహ్వానించాడు. కానీ ఆయన పిలిచిన పిలుపే వారికి స్థిరపడిపోయంది. కొందరు వీరిని "బాబా ! (తండ్రీ!) అని సంభోదించేవారు. అందువల్ల ఆ ఫకీరు "సాయిబాబా" అయ్యారు. మహల్సాపతి మొదట పిలిచిన పిలుపే ఆ ఫకీరుకు సార్ధకనామధేయం అయ్యింది. అంటే బాబాకు నామకరణం చేసింది మహల్సాపతే అని చెప్పవచ్చు !

శ్రీసాయిబాబా ఖ్యాతి దేశదేశాంతరాలకు వ్యాప్తిచెంది ఈనాడు లక్షలాది భక్తులువారిని పూజిస్తున్నారు. కానీ బాబాను గొప్ప మహనీయునిగాను, దేవుని ప్రతి రూపంగానూ గుర్తించి ప్రప్రథమంగా వారిని పూజించిన భాగ్యం మహల్సాపతికే దక్కింది. అంతేకాక షుమారు 45 సం॥ల పాటు ఆ దేవునితో నిద్రించే భాగ్యం కూడా మహల్సాపతికే దక్కింది. బాబా రాత్రిళ్ళు తమతో నిద్రించేందుకు తాత్యాకోతేపాటీలును, మహల్సాపతిని తప్ప మరెవరిని అనుమతించేవారు కాదు. తాత్యాకు ఈ భాగ్యం 14 సం॥లు మాత్రం దక్కింది.

1886లో బాబా మహల్సాపతి తొడపై తమ తలపెట్టి పడుకుని, "అరే భగత్ ! నేను అల్లా దగ్గరకి వెళుతున్నాను. నా దేహాన్ని మూడు రోజుల పాటు కాపాడు. నేను తిరిగి వచ్చినా సరి, లేదా నా దేహాన్ని ఆ వేపచెట్టు క్రింద పూడ్చి రెండు జండాలు పాతు!" అని చెప్పి తమ భౌతిక దేహాన్ని త్యజించారు. శిరిడీ ప్రజలందరూ బాబా చనిపోయారని, శవాన్ని అలాగే





ఉంచడం గ్రామానికి కీడని, వారిని ఖననం చేయడం మంచిదని ఒత్తిడి తెచ్చారు. మహల్సాపతి వారి ఒత్తిడికి లొంగలేదు. తన ప్రాణాన్ని సైతం పణంగా పెట్టి వారి భౌతికదేహాన్ని మూడు రోజులపాటు కాపాడే బాధ్యత తీసుకున్నారు. వారికి బాబాపై నున్న భక్తి, నమ్మకం అటువంటిది ! అప్పుడు శిరిడీ ప్రజల ఒత్తిడికి మహల్సాపతి లొంగివుంటే బాబా మనకు దక్కి ఉండేవారు కాదు. బాబా మూడు రోజుల సమాధి తర్వాతి తిరిగి తమ భౌతిక శరీరంలోనికి ప్రవేశించి 32 సంవత్సరాల పాటు మన మధ్య మెలిగి, మన నుద్ధరించడానికి పరోక్షంగా మహల్సాపతే కారకుడు. అటువంటి మహనీయునికి కృతజ్ఞతలు చెప్పుకోవడమే గాక వారి జీవితచరిత్రను తెలుసుకుందాం !

మహల్సాపతి శిరిడీగ్రామానికి చెందిన పేద విశ్వబ్రాహ్మణ (కంసాలి) కుటుంబంలో జన్మించారు. విశ్వబ్రాహ్మణ కులదైవమైన ఖండోబాదేవత ఆలయం శిరిడీ పొలిమేరలలో ఉండేడి. ఆ ఆలయానికి మహల్సాపతి పూజారిగా వ్యవహరించేవాడు. ఇది ఆయనకు వంశపారపర్యంగా సంక్రమించింది. మహల్సాపతికి ఒక చిన్నఇల్లు, ఏడున్నర ఎకరాల మెట్ట భూమి తప్ప మరే ఆస్తిపాస్తులు లేవు. మెట్ట భూమి మీద వచ్చే ఫలసాయం పెద్దగా ఏమీ ఉండేది కాదు. కులవృత్తి అయిన కంసాలి పని చేస్తూ వుండినా ఆ కుగ్రామంలో రాబడి అంతంత మాత్రమే ! భార్య, ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు అతని కుటుంబం. అందువల్ల జరుగుబాటు చాలా కష్టంగా ఉండేది.

ఇతనికి ఖండోబా అంటే అమితభక్తి. తీరికసమయాలలో సంతసాధువులతోనూ, సత్సంగాలతోనూ గడిపేవాడు. ఖండోబా పట్ల అతని భక్తి క్రమేపి వృద్ధి చెంది, ఒక్కొక్కసారి వారితో తదాత్మ్యంచెంది ఆవేశంగా మాట్లాడేవాడు. మహల్సాపతికి ఖండోబా ప్రత్యక్షదైవమని, ఆ దైవం మహల్సాపతి నావరించి ప్రజల భవిష్యత్తును గురించిన ప్రశ్నలకు జవాబులిస్తారని బాగా ప్రచారం అయ్యింది. అందువల్ల ఆయనకు ఖండోబా గణంగా గుర్తింపువచ్చింది. ఒకసారి ఒక వ్యక్తికి ఖండోబా పూనింది. అప్పుడు ఆ గ్రామస్థులు వేపచెట్టు క్రింద నివసించే ఈ ఫకీరు ఎవరని ఖండోబా నడిగారు. ఖండోబా చెట్టు సమీపంలో ఒక చోట చూపించి, అక్కడ త్రవ్వమన్నారు. అక్కడ త్రవ్వితే ఒక భూగృహం గోచరమైంది. భూగృహంలో చిత్రంగా రెండు ప్రమిదలు వెలుగుతున్నాయి. ఇంకా జపమాలలు, కొయ్యపలకలు కన్పించాయి. ఆ భూగృహంలో ఆ ఫకీరు 12 సం॥లు తపస్సు చేసినట్లు ఖండోబా చెప్పారు. ఈ విషయం సచ్చరిత్రలో పేర్కొనబడివుంది. కానీ సచ్చరిత్రలో చెప్పింది ఉన్నట్లు ఖండోబా దేవత పూనింది ఎవరో ఒక వ్యక్తికి కాదని, మహల్సాపతికేనని కొందరి చరిత్రకారుల అభిప్రాయం. ఇది నిజమై ఉండవచ్చు కూడా !

మహల్సాపతి కొడుకు సంవత్సరం వయస్సులోపే మరణించాడు. ఆ పిల్లవాడు మరణించే రోజు ఒక చిత్రమైన సంఘటన జరిగింది. మహల్సాపతి శిరిడీకి సమీపంలో ఉన్న "కణ్‌కూరి" అనే గ్రామానికి వెళ్ళాడు. అక్కడ గ్రామస్థులతో కలిసి నెగడు వేసుకొని, దాని చుట్టూ కూర్చొని, రాత్రంతా భగవంతునికి సంబంధించిన విషయాలు చెప్పుకుంటూ గడిపి, తెల్లవారు ఝామున నిద్రించాడు. అప్పుడతని కొక కలవచ్చింది. కలలో నల్లటి



భయంకరమైన వ్యక్తి, ఒక పెద్ద బండను తీసుకొని, దానిని మహల్సాపతికి గురిపెట్టి, "నా కూర నాకివ్వు. లేదంటే ఈ బండతో నిన్ను మోదుతాను" అన్నాడు. మహల్సాపతికి ఆ వ్యక్తి కాలపురుషుడని అర్థమైంది. భయపడకుండ ఖండోబాను స్మరిస్తూ అతనికి కూర పెట్టాడు. ఆ వ్యక్తి కూర తీసుకొని, చేతులోని బండను అక్కడే పడవేసి వెళ్ళిపోయాడు. తర్వాత అతనికి మెలుకువ వచ్చింది. అప్పుడే శిరిడీ నుండి ఒక వ్యక్తి వచ్చి మహల్సాపతితో "నీ కుమారుడు చాలా ప్రమాదస్థితిలో ఉన్నాడు. వెంటనే శిరిడీకి వెళ్ళు!" అని చెప్పాడు. మహల్సాపతికి అంతకు ముందు వచ్చిన కల జ్ఞప్తికి వచ్చి, అసలు విషయం అంతా తెలిసిపోయింది. ఆ వ్యక్తితో "నిజం చెప్పు! రాత్రి నా కుమారుడు చనిపోయాడు కదా?" అని ప్రశ్నించాడు. ఆ వచ్చిన వ్యక్తి ఆశ్చర్యపోయాడు. మహల్సాపతి చెప్పింది నిజమేనని మహల్సాపతి కుమారునికి హఠాత్తుగా సుస్తి చేసి చనిపోయాడని చెప్పాడు. ఆ వార్త ఒక్కసారిగా చెప్పకూడదని అట్లా చెప్పాడు. మహల్సాపతి గుండె నిబ్బరానికి అక్కడ వారంతా ఆశ్చర్యపోయారు. మహల్సాపతి శిరిడీ వెళ్ళి కాలపురుషుడు బండను విసిరిన చోట అంటే ఖండోబా దేవాలయం ప్రక్కనున్న మర్రిచెట్టు క్రింద కుమారుని సమాధి చెశాడు.

మహల్సాపతికి మరోసారి ఇంకొక కల వచ్చింది. కలలో ఒక బ్రాహ్మణుడు కనిపించి, "నీవీ కంసాలి పని చేయకుంటేనేం?' అని ప్రశ్నించాడు. బ్రాహ్మణుడు, "ఏం చేయనక్కర లేదు. నా పాదాల వద్ద శరణాగతి పొందు!" అన్నాడు. కలలో కన్పించిన బ్రాహ్మణుడు ఖండోబాయేనని తలచి, వారి ఆదేశానుసారం తన వృత్తి విడిచి, భిక్షాటన ద్వారా జీవనం సాగించడం

మొదలుపెట్టాడు. తన సత్సంగ మిత్రులైన కాశీరాం షింపే, అప్పా జోగ్లే మహల్సాపతి కుటుంబాని కవసరమయ్యే సరుకులు మోయనగా పంపేవారు. ఆ మోయనలు, ఊర్లో చేసే భిక్షద్వారా మహల్సాపతి కుటుంబం జీవనం సాగించేవారు.

మహల్సాపతి పరమ భాగవతోత్తముడు. ఎప్పుడూ ఖండోబా ధ్యానంలోనూ సాధు సత్పురుషుల సేవలోనూ గడిపేవాడు. శిరిడీలో కొంతకాలం నివసించిన జానకీదాసు, దేవీదాసులను సేవించాడు. మహల్సాపురాణం నిత్యం పారాయణ చేసేవాడు. మహల్సాపతి నిర్మల భక్తిని గురించి బాబా ఎప్పుడూ “భగత్ !” అని సంభోదించేవారు. భగత్ అంటే భగవంతుని భక్తుడని, భగవంతుడని అర్థం. బాబా ఇలా మరే భక్తుని సంభోదించినట్లు దాఖలాలు లేవు.


చాంద్‌పాటిల్ పెళ్ళి బృందంతో బాబా షిరిడీ వచ్చినప్పుడు మహల్సాపతి “రండి స్వామి” అని ఆహ్వానించినట్లు మనం తెలుసుకున్నాం. బాబా నేరుగా ఖండోబా ఆలయప్రాంగణం లోనికి వచ్చారు. మహల్సాపతి “కూర్చొండి స్వామి !” అన్నారు. బాబా కూర్చుని అక్కడి పరిసరాలన్నీ గమనిస్తూ, “ఆహా ! ఈ చోటు ఎంత ప్రశాంతంగా వుంది. నాబోటి ఫకీర్లు ఉండటానికి చాలా అనువైనది” అన్నారు. కానీ మహల్సాపతి బాబా నొక ముస్లిం ఫకీరుగా భావించినందున వారిని హిందూ దేవాలయంలో ఉండటానికి అనుమతించ లేదు. అప్పుడు బాబా “హిందువులకు, ముస్లింలకు మరి ఇతర మతస్థులకు దేవుడు ఒక్కడే ! నేనిక్కడ ఉండటానికి నీవు ఇష్టపడలేదు. గనుక నేను వెళ్ళిపోతాను” అంటూ వెళ్ళి శిరిడీ వెలుపల నున్న వేపచెట్టు నాశ్రయించారు.

(సశేషం)



# శ్రీవాసుదేవానంద సరస్వతీ (తెంబే స్వామి)

**సురేంద్రాబాబు**, కొవ్వూరు



సాధుసత్పురుషులందరు ఒకరినొకరు సోదరభావంతో ప్రేమించు కుంటారని క్రింది సంఘటన తెలుపుతుంది.

శ్రీవాసుదేవానంద సరసర్వతీ స్వామి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం (రాజమండ్రి)లో కొంతకాలం నివశించారు. ఇతనిని టెంబే స్వామి అని కూడా పిలుస్తారు. ఇతడొక గొప్ప జ్ఞాని, దత్తాత్రేయుని భక్తుడు.

నాందేడుకు చెందిన పుండలీక రావు అనే న్యాయవాది తన స్నేహితులతో వారిని దర్శించారు. వారితో మాట్లాడుచున్నప్పుడు సాయిబాబా ప్రసక్తివచ్చింది. వారు షిర్డీ వెళుతున్నట్లు కూడా స్వామితో చెప్పారు.

అప్పుడు స్వామి బాబాకు నమస్కరిస్తూ, టెంకాయ నొకదానిని



పుండలీకరావుకు ఇచ్చి, **"దీనిని నా సోదరుడు సాయికి ప్రణామాలతో సమర్పించు, నన్ను మరువవద్దని చెప్పు"** అన్నారు.

ఒకనెల తరువాత పుండలీకరావు అతని స్నేహితులు శిరిడీకి బయలుదేరారు. మన్మాడ్ చేరారు. వాళ్లు తెచ్చుకున్న కారం అటుకులు తిని, నీళ్ళు త్రాగాలని ఒక సేలయేరు దగ్గర ఆగారు. అటుకులు చాలా కారంగా వున్నాయి. వాటిని కొబ్బరి పలుకులు కలిపితే కారం తగ్గి, రుచిగా ఉంటాయని ఒకతను సలహా ఇచ్చాడు. వెంటనే వాళ్ళ దగ్గర వున్న టెంకాయ నొకదానిని పగులకొట్టి, కొబ్బరితీపి అటుకులతో కలిపి తిని, నీళ్ళు త్రాగారు. కానీ వాళ్ళు పగులగొట్టిన టెంకాయ టెంబే స్వామిదని తెలిసి, పుండరీకరావు భయపడిపోయాడు. సర్వజ్ఞుడైన బాబాకు ఈ విషయం తెలిసిపోయింది. పుండరీక రావు బాబాను దర్శించిన వెంటనే మొదట తన సోదరుడు పంపిన టెంకాయ యివ్వమని అడిగారు. పుండలీకరావు బాబా పాదాలపై బడి తన తప్పును, అలక్ష్యాన్ని క్షమించమని వేడుకున్నాడు.ఆ టెంకాయకి బదులు వేరొక టెంకాయి సమర్పిస్తానని అన్నాడు. అందుకు **బాబా తన సోదరుడిచ్చిన టెంకాయకు సాటి మరేదిలేదని, అంతేగాక తమ సంకల్పము వలననే యిదంతా జరిగినదని, అందుకు పుండలీకరావు ఏ మాత్రమూ కర్తకాదని చెప్పి సాయి ఓదార్చారు.**

**మంచిగాని, చెడుగాని చేసే దానిని మనం కర్తలు కాదని భావించి, మన గర్వాన్ని, అహంకారాన్ని విడిచిపెట్టిన, మనకు ఆధ్యాత్మిక ప్రగతి చేకూరునని శ్రీసాయి చెప్పారు.**



# శ్రీవాసుదేవానంద సరస్వతీ (టెంబే స్వామీ) సద్గురు చరిత్ర

**457 పేజీలు** **గురుదక్షిణ : రూ. 150/-**

శ్రీశ్రీశ్రీ వాసుదేవానంద సరస్వతీ (టెంబే స్వామీ) సద్గురు మహారాజ్ గురించి చాలామందికి తెలియదు. శ్రీస్వామివారు షిర్డిసాయిబాబాకు సమకాలికులు. షిర్డీ సాయిబాబా ఆయనను తమ సోదరునిగా పేర్కొని యున్నారు. ఈ విషయము సాయిబాబా జీవితచరిత్ర యందు 50వ అధ్యాయములో మనం గమనించగలము. శ్రీశ్రీశ్రీవాసుదేవానంద సరస్వతీ (టెంబేస్వామి) సద్గురు చరిత్ర అను విశేషగ్రంథము మూల రచయిత శ్రీదత్తాత్రేయధుండీరాజకవీశ్వర్ (మరాఠీమూలం) మన తెలుగు భాషా భక్తుల కొరకు శ్రీదత్త శ్రీమాత ఉపాసకులు శ్రీ గుఱ్ఱప్పడియ వెంకటలక్ష్మీనరసింహ విద్యాసాగర్ శర్మగారిచే అనువక్త చేయబడిన ఈ మహాగ్రంథము పునఃప్రచురణ చేయటం జరిగినది. శ్రీ టెంబేస్వామి (1854–1914) మన తెలుగు భక్తులకు చిరపరిచితులు, శ్రీస్వామివారు ఆశేతుహిమాచలం మొత్తం భారతదేశం కాలినడకన చేస్తూ మన హిందూ హైందవ ధర్మరక్షణ కోసం అనేక చాతుర్మాస దీక్షతో సంచరించి అనేక అమూల్యమైన గ్రంథములను సంస్కృత, మరాఠీ భాషలలో అందించిరి. ఈ గ్రంథము ప్రతి తెలుగువారి ఇంట ఉండవలసిన మహాగ్రంథము.

ప్రాప్తిస్థానం 1. శ్రీసాయిదర్శన్, హైద్రాబాద్.
సెల్ నెం. 98667 48099 ఫోన్ :040–656400220
2. శ్రీ దత్తశ్రీనివాస్, హైద్రాబాద్ సెల్ నెం. 99890 99288
3. శ్రీ భారతుల సుబ్రహ్మణ్యం, మార్కాపురం సెల్ : 9440820130 ▯

# జ్ఞాన ముత్యాలు

డా|| ఆర్. హనుమంతరావు

- “ఎవరైనా తన సర్వస్వాన్ని సాయి సన్నిధానంలో సమర్పిస్తే నిరంతరం సాయిని స్మరిస్తుంటే, తన అహంకారాన్ని, అవిద్యను, అజ్ఞానాన్ని నశింపచేసుకుంటారు. అతడు ప్రాపంచికమైన అన్ని దుర్గుణాలకు దూరమై, పాపకృత్యములనుండి విముక్తి పొందుతాడు. అతనికి నిరంతరానందం లభిస్తుంది. ప్రగాఢమైన విశ్వాసంతో “సాయి! సాయి!” నామాన్ని ఉచ్చరిస్తుంటే చాలు, మన పాపాలు మాయమౌతాయి.”

- “సాయి కథలు అత్యంత శ్రద్ధాభక్తులతో, అచంచల విశ్వాసంతో విన్నా ఎవరికైనా వారి శారీరక, మానసిక రోగాలు నశిస్తాయి.”

**శ్రీ షిర్డీసాయిబాబా దివ్య వాక్కులు :**

- “ మీరు ఏమి చేస్తున్నా, ఎక్కడ ఉన్నా, మీరు చేస్తున్న ప్రతి పని నాకు తెలుసు. ఈ విషయాన్ని మీరెప్పుడూ మరవకండి. మీరెప్పుడు నన్ను స్మరిస్తే, నా అవసరం మీకెప్పుడు కావలసివస్తే నేనెప్పుడు మీతోనే ఉంటాను. భయపడకండి.”

- “ఎవరైనా వారి భారాన్ని పరిపూర్ణ విశ్వాసంతో నాపై ఉంచితే దాన్ని నేనే భరిస్తూ వారిని కాపాడుతాను.”

- “ఎవరైతే నన్నే ఆశ్రయిస్తూ, తన మనస్సును సమస్త ప్రాపంచిక



విషయాలనుండి, ప్రాపంచిక సుఖములనుండి మరల్చి, నన్నే స్మరిస్తూ ఉంటారో వారు పరమానందాన్ని పొందుతారు. తన శరీరమును గురించి కానీ, మనస్సును గురించి కానీ భయపడ నవసరం లేదు. నా భక్తుల విషయంలో అన్న వస్త్రాలకు ఎవ్వరికి కొరత ఉండదు.”

- “ఎవరైనా నన్నే సంపూర్ణంగా నమ్మి ప్రతి అంశాన్ని నాకే వదిలితే, నేను వారినేనాటికీ అధోగతికి పోనివ్వను. వారిని కాపాడటానికి నా సరస్వాన్ని అడ్డుతాను. నేను భక్త పరాధీనుడను. నా భక్తులకు సర్వదా బానిసను.”

- “నేను సర్వాంతర్యామిని. మీకెందుకు భయం? నా భక్తుల గురించే నేనెప్పుడూ ఆలోచిస్తాను. భక్తుడు పతనావస్థలో ఉంటే, అతనిని కాపాడుటే నా విధి. ప్రతిచర్యకు నేనే బాధ్యుడను. నేనే అతని రక్షకుడను.”

- “ఎవరు ప్రతిప్రాణిలో నన్ను (భగవంతుణ్ని) దర్శిస్తూ కరుణార్ద్ర హృదయముతో ఆదరించి పోషిస్తారో, వారు నన్ను నిజంగా పోషించన వారౌతారు. వారికంటే నాకు ప్రియమైన వారెవ్వరూ లేరు. ఏ ప్రాణికైనను అపకారము, హాని తలపెట్టరాదు. పేదలపై, అనాథులపై, నిరాశగ్రస్తులపై క్రూరంగా ప్రవర్తించరాదు. వికలాంగులను, అసహ్యమైన రోగాలతో బాధపడువారికి, అసంతృప్తితో చీదరించుకొనరాదు. వీరందరిలో నన్ను (భగవంతుని) దర్శించండి. ఈ విధంగా మీరు చేయగలిగితే మీకు జనన మరణములపై భయముండదు.”

- “అదృష్టవంతులు, పాపవిముక్తులు నన్ను వెతుక్కుంటూ వచ్చి నన్నే

ఆరాధిస్తారు. ఆడంబరాలు, ఆరాటం చేయకుండానే "సాయి, సాయి" అను నామాన్ని హృదయపూర్వకమైన భక్తితో ఆర్ద్రహృదయంతో, ఆర్తనాదంతో తదేక ధ్యానభావనతో ఉచ్చరించాలి. ఒక క్షణంలో మీ కష్టాలు మటుమాయమౌతాయి. నేను మీ పాపాలు అన్నింటిని పోగొట్టగలను. దీన్ని మీరు నమ్మండి."

□ "ప్రేమ పూర్వకమైన భక్తితో నాకు అర్పించిన కానుక ఎంత స్వల్పమైనా నేను సిద్ధంగా స్వీకరిస్తాను. అహంభావంతో, అహంకారంతో బ్రహ్మాండాన్ని సమర్పించినా నేను దానిని వెంటనే తిరస్కరిస్తాను. నాకంగీకారమైనది, అమోదకరమైనది పవిత్రప్రేమయే. సమర్పించబడిన పదార్థ పరిమాణము కాదు. నేను స్వీకరించిన దానికి శతాధికంగా మరల భక్తునకు అందజేస్తాను. దప్పిక గొన్నవారికి నీరందించండి. ఆకలి గొన్నవారికి అన్నదానం చేయండి. దిగంబరులకు వస్త్రదానం చేయండి. రోగులకు, అనాధులకు, అభాగ్యులకు మీ శక్తి కొద్ది సాయం చేయండి. స్నేహహస్తం అందించండి. సాయం కోసం వచ్చినవారిని సాదరంగా పవిత్రప్రేమతో పలకరించండి. కుక్కలమాదిరిగా మొరుగుతూ వారిని తరిమికొట్టకండి. వారిలో శ్రీమహావిష్ణువును దర్శించండి. 'అల్లామాలిక్' అంటే దేవుడే నాకు ఏకైక రక్షకుడు. భగవానుని చర్యలు అగోచరాలు, అనిర్వచనీయాలు, అద్భుతాలు. ఆ దైవ చిద్రూపానికి నమోవాకాలు అర్పించండి. అట్టి దైవకార్యం అనివార్యం. మనం ప్రతిప్రాణిలో దైవ స్వరూపాన్ని దర్శించగలిగి ఆదరించగలిగి ఆరాధించగలిగితే అట్టి అనంతుని దీవెనలు మనకు తప్పక లభిస్తాయి."

□ "మీరు గమనిస్తున్న ఈ శరీరం ఐదడుగుల శరీరమే కాదు. నా శరీరం అదృశ్యమైనా నా సమాధిలోని అస్థికలే చాలా చురుకుగా పనిచేస్తాయి.



నా సమాధి నుండి నేను పలుకుతూ, నా శరణాగతి పొందినవారికి సుఖ, సంతోషాలను ప్రశాంత చిత్తాన్ని ప్రసాదిస్తాను. ఇది అక్షరసత్యం. నన్ను నమ్మండి. నేనీ భౌతికశరీరంలో కనిపించకపోయినా, నేనెల్లప్పుడు మీతోనే ఉంటాను. మీరు దిగులు పడకండి."

□ "నా కోసం మీరెక్కడ వెతకనక్కరలేదు. నేనెప్పుడు మీతోనే ఉంటాను. మీ పేరు, మీ ఆకారం (శరీరం) మరచిపొండి. మిగిలేది ఏముంది? ఆ మహోన్నతమైన ఆత్మశక్తియే ! మీలోనే నన్ను చూడండి. సమస్త ప్రాణులలో చూడండి! పరమసత్యమిదే. వారే భగవత్స్వరూపులు. నన్ను అత్యంతప్రేమతో ఆరాధించేవారు. నేను (భగవంతుడు) లేని ప్రపంచాన్ని దిక్కులేని ఎడారిగా గమనిస్తారు. అందువల్ల మీ ప్రయోజనం కోసం మీరు అహంకారం మమకారములను వీడి నన్ను దర్శించండి. మీలోని రాగద్వేషాలు రూపుమాసిపోతాయి. నేను మీ హృదయమునందు ప్రతిప్రాణి యందు స్థిరమై యున్నాను. మీరు నా రక్షణ పొందెదరు గాక !"

□ "నన్నెప్పుడు భావిస్తూ, ధ్యానిస్తూ, అచంచల విశ్వాసంతో ఆరాధిస్తూ, సంపూర్ణంగా శరణాగతిని పొందినవానిని సమస్త బంధముల నుండి విముక్తుణ్ణి గావించి మోక్షాన్ని ప్రసాదించడం నా ప్రధానలక్షణం, విధి. నా కథలు అత్యంత శ్రద్ధతో విని మననం చేయువారికి సమస్త రోగాలనుండి విముక్తి కలుగుతుంది. అందువలన ప్రథమంగా నా కథలను శ్రద్ధాభక్తులతో విని, వానిని ధ్యానిస్తూ వానిలో లీనంకండి. మీ సుఖ సంతోషాలకూ, సంతృప్తికీ ఇదే సులభమార్గం."

- “నేను ఎవరినుండైనా ఒక రూపాయి తీసుకుంటే, వారికి దానికి పదిరెట్లు చెల్లిస్తాను. నేనెవరినుండి దేనిని తీసుకొనను. నేను కోరేది భక్తుల పవిత్రప్రేమనే. రైతు విత్తనం నాటటం ఎందుకు? భవిష్యత్తులో అధిక పంటలను సాధించడానికే కదా ! అలాగే సద్గురువునకు మీ పవిత్రప్రేమను మనసారా సమర్పిస్తే, వారు మీకు అమూల్యమైన, అత్యధికమైన కైవల్యాన్ని ప్రసాదిస్తారు”

- “అత్యంత ప్రేమతో నన్ను స్మరించండి. మీ సమస్త కోరికలను నెరవేర్చుకొండి. మీ గాఢ భక్తిని పెంపొందించుకొనండి! ‘సాయి, సాయి’ నామోచ్ఛారణవలననే మీ వాచా, శ్రవణదోషాలను తొలగించుకొనండి.”

- “నా రక్షణ కోరేవారికి సాయం చేయటానికి నేను సప్తసముద్రాలను కూడా దాటుతానని ప్రమాణము చేస్తున్నాను. ప్రమాదకాలంలో భగవంతుడు భక్తుల రక్షణకు పరిగిడగలడు.”

- “మొదట ఆకలిగొన్నవారికి అన్నం పెట్టండి. తర్వాత మీరు తినండి. నేను అన్నార్తులతో, అభాగ్యులలోనే ఉంటాను. సర్వస్వంలోను నన్నుగాంచిన వారే నాకు అత్యంత ప్రీతిపాత్రులు.”

- “నా భక్తుల బాధలు, ఆవేదనలు నావే. వారికొరకే వానిని నేనే భరిస్తాను. తొలగిస్తాను.”

సూచన : మనోవాక్కాయకర్మలతో సద్గురుని పాదపద్మాలను మనం శరణువేడటం, సమస్త పాపపరిహరణకై సతతము వారి నామోచ్ఛరణ చేయడం ఒక్కటే మిక్కిలి ఉత్తమమార్గం. దీనినే సద్గురు శరణాగతి కోరడం అంటారు. మన మనస్సు ప్రశాంత చిత్తాన్ని పొందితే మనం శరణాగతిఫలాన్ని పొందినట్లే. ఈ శరణాగతి ఫలం మనకు శుభసూచకం. దీనిననుసరించి మనకు సద్భక్తి, విజ్ఞానం లభిస్తాయి.




# ప్రేమామృత సాగరుడు

## శ్రీసాయి పాదానంద రాధాకృష్ణ స్వామీజీ

- *యం.పి.సాయినాథ్,* *ప్లాట్ నెం.32, సాయినగర్ కాలనీ, గాంధీనగర్, హైద్రాబాద్-80, ఫోన్ : 2753 4805*


(గత సంచిక తరువాత భాగం)



### కొండలను కదిలించే నమ్మకం

సాయిపై తిరుగులేని నమ్మకాన్ని పెట్టుకోమంటారు స్వామీజీ. నమ్మకం కొండలను కదిలించివేస్తుంది అనేది కేవలం ఒక సూత్రం కాదు అని స్వామీజీ పెక్కుమార్లు అనుభవపూర్వకంగా తెలియచేశారు.

ఒకసారి స్వామీజీ మద్రాసులో ఒక భక్తుని గృహంలో భజన చేస్తున్నారు. వాతావరణమంతా దైవనామంతో ప్రభావితమయింది. అదే సమయంలో “దీపం కొండెక్కుతోంది. నూనెను పోసిరా” అని ఆ యింటి గృహిణి తన కుమార్తెను పురమాయించింది. అది విన్న స్వామీజీ “నూనె అక్కరలేదు. నీటిని పోద్దాం, దీపాన్ని వెలగనిద్దాం” అని నూనె బదులు నీటిని స్వామీజీ ఆ దీపంసెమ్మెలో పోశారు. అంత నీటితోనే దీపం వెలిగింది. ఇది సాయి చమత్కారమా ? సాయి పాదానంద చమత్కారమా? సాయిపై నమ్మక ప్రభావమే !



## భక్తుల సంరక్షణ

స్వామీజీ భక్తులకు కేవలం ఆధ్యాత్మిక బోధలే చేసేవారు కారు. భక్తుల లౌకిక కోర్కెలు తీర్చి తరింపచేయటమే స్వామీజీ కోర్కె.

## తల్లిని గూర్చి తల్లికే తెలుసు

1979లో స్వామీజీ షిరిడీలో ఒక సభలో మాట్లాడుతూ సాయిబాబా తన తల్లి, తండ్రి, స్నేహితుడు అని వర్ణించారు. ఒకరు లేచి సాయి తల్లిగా కూడా ఎట్లా ప్రవర్తిస్తారు అని ప్రశ్నించారు. స్వామీజీ అప్పుడు తన స్వీయ అనుభవాన్ని తెలియచేశారు.

ఒక మహిళ తనకు పుట్టబోయే బిడ్డకు చనుబాలు (తల్లిపాలు) ఇవ్వాలనే కోర్కెతో స్వామీజీ వద్దకు తన భర్తతో పాటు వచ్చింది. గతంలో ఆమె ఒక బిడ్డను ప్రసవించింది, కాని ఆమె తన పాలు ఇవ్వలేకపోయింది. ఈసారి అట్లా కాకూడదనే, స్వామీజీని కోరింది. స్వామీజీ "నీ బిడ్డకు నీ పాలే ఇద్దువుగాని" అన్నారు ఆమెతో. స్వామీజీ ఆమెకు సాయిబాబా ఊదిని ఇచ్చారు. సాయిని ప్రార్థించమన్నారు. ఆ భార్య భర్తలు సంతోషంగా వెళ్ళిపోయారు.

ఆమె ప్రసవించింది. ఆమెకు చనుబాలు రాలేదు. బిడ్డకు పాలివ్వలేకపోయింది. ఈ సంగతిని ఆమె భర్త స్వామీజీ వద్దకు వచ్చి విన్నవించుకున్నారు. సాయిబాబాను ప్రార్థించవలసినదని స్వామీజీ ఆమె భర్తతో పలికారు.



ఇది జరిగిన తర్వాత ఆమెకు చనుబాలు పడ్డాయి. ఆమె తన బిడ్డకు పాలు ఇచ్చింది.

ఈ సంఘటనతో ఒక తల్లి పడే బాధను సాయి మాత మాత్రమే అర్థం చేసుకోగలడని రూఢి చేశారు స్వామీజీ !

## తీరని కోరిక ... తొలగిన ముప్పు

సాయిపాదానందగారి ఒక భక్తుడు తన కుటుంబముతో మరునాడు సర్కస్ చూడటానికి పోదామనుకున్నాడు. ఆ రాత్రి స్వామీజీ వారి కలలో కనిపించి సర్కస్ పోనవసరం లేకుండా, కలలోనే సర్కస్ చూపించారు. ఆ కుటుంబం సర్కస్‌కు పోలేదు.

ఆ కుటంబం సర్కస్‌కు పోయి చూడవలసిన సమయంలో ఆ సర్కస్ గుడారానికి నిప్పు అంటుకుని మంటలు వచ్చాయి. ఆ కుటంబం సర్కస్‌కు పోయివుంటే, వారికి అగ్ని ప్రమాదం జరిగేది. స్వామీజీ వారిని ఆ ముప్పునుండి తప్పించారు. ఈ సంగతి తెలిసిన ఆ కుటుంబం స్వామీజీకి కృతజ్ఞతలు తెల్పుకున్నారు.

## పారిపోయిన పిల్లవాడు

స్వామీజీ ఒకసారి మద్రాసులో నుండగా ఒక పెద్దమనిషి వచ్చి తన పిల్లవాడు పారిపోయాడని, ఆచూకీ తెలియటం లేదనీ స్వామీజీ చెప్పాడు. వచ్చిన ఆ పెద్దమనిషి స్వామీజీ భక్తుడు కాడు. పైగా సాయిని గూర్చి తెలియదు. స్వామీజీ హృదయం ద్రవించింది. అయిదవ రోజున బిడ్డ వస్తాడని, సాయిని ప్రార్థించవలసినదని ఆ వ్యక్తికి చెప్పి పంపించివేశారు స్వామీజీ.

అయిదవ రోజు ఆ వ్యక్తికి ఒక టెలిగ్రాం వచ్చింది. ఆ టెలిగ్రాంలో పిల్లవాడు మద్రాసు రైలులో వస్తున్నాడని వున్నది. ఆ పిల్లవాడు వచ్చాడు.

ఆ పిల్లవానితో సహా ఆ వ్యక్తి స్వామీజీని సందర్శించారు.

ఆ పిల్లవాడిని స్వామీజీ ఎందుకు పారిపోయావని ప్రశ్నించారు. తల్లితండ్రులు తనపై కోపంగా వున్నారని, అందుకు వెళ్లిపోయానని చెప్పాడు. తిరిగి ఎలా వచ్చావు అని స్వామీజీ ప్రశ్నించారు. కలకత్తాలో వుండగా ఒక నాటి రాత్రి సాయి స్వప్నంలో కనిపించి, కలకత్తా రైల్వేస్టేషన్‌కు వెళ్ళమని ఆ కుర్రవాణ్ణి ఆదేశించారు. అతడు రైల్వేస్టేషనుకు వెళ్ళగానే ఎవరో ఒక అజ్ఞాతవ్యక్తి అతన్ని కలిసి, మద్రాసుకు టిక్కెట్టుకొని ఇచ్చి, ఇంటికి పిల్లవాడు వస్తున్నాడని టెలిగ్రాం ఇచ్చాడు. స్వామీజీ "కలలో సాయిబాబా ఎలా వున్నారు?" అని ప్రశ్నించారు. "సాయి భిక్షమెత్తుకునే వారివలె ఉన్నాడు. చేతిలో ఒక డొక్కు (ఖాళీడబ్బా) కూడా వున్నది" అన్నాడు ఆ పిల్లవాడు.

స్వామీజీ ఇచ్చిన మాటను నిలబెట్టకుండా సాయి వుంటారా?

స్వామీజీ తెలిపేది ఒకటే, **సాయిపై నమ్మకాన్ని దృఢపరచుకోండి, సాయి ఎడ సంశయాత్మకులుగా వుండకండని అనే స్వామీజీ మనకు చెప్పే విషయం.**

## ప్రేమ తత్వము

శ్రీ రాధాకృష్ణస్వామీజీ మూర్తిభవించిన ప్రేమతత్వము. శ్రీసాయి దివ్య ప్రేమవలెనే ఆయన ప్రేమ అవధులు లేనిది. అందరిని దగ్గరకు చేర్చుకొనినది. క్రొత్తలో స్వామీజీ ఎవ్వరినీ తన పాదములను తాకినిచ్చేవారు కాదు. అటువంటి స్వామీజీ అందరినీ తన పాదములను తాకుటకు అంగీకరింపచేసిన వైనము





చాలా ఆశ్చర్యకరమైనది, ఆనందకరమైనది.

ఒకసారి స్వామీజీ తన స్వప్నంలో బాలబాలికలతో తోటలో తిరుగుతున్నారు. ఒక చెట్టునుండి ఆంజనేయుడు దిగి స్వామజీకి ఒక పండు నిచ్చి తినమన్నారు. స్వామీజీ ఆ పండును బాలబాలికలకు పంచిపెట్టబోతే ఆంజనేయుడు "జాంబవంతుడు పిల్లలకు పండ్లు వేరే ఇస్తాడు. ఆ పండు నీ కోసమే. నీవు 'అయిదు' సరిచేసుకొని ఆ ప్రేమను పంచుతూ ఆనందంగా వుండు. ఆ ఫల రసాస్వాదన చేసి ప్రేమను అందరకు పంచు" అన్నారు, కల సమాప్తి అయింది.

మరుసటిరోజు స్వామీజీకి ఆంజనేయస్వామి మందిరాన్ని దర్శించాలనే తీవ్రకోరిక కల్గి, తన భక్తులతో బయలుదేరారు. దారిలో అయిదుగురు స్త్రీలు పూజలు చేస్తున్నారు. ఆ అయిదుగురు స్త్రీలు వచ్చి ఆయనను శ్రీరామచంద్రప్రభువుగా పరిగణించి పూజించారు. స్వామీజీకి గతరాత్రి కలలో ఆంజనేయుడు 'అయిదు' అన్నారు. ఐదుగురు స్త్రీలు అక్కడవున్నారు. అయిందిటిని సరిచేసుకోమంటే కామ, క్రోధ, మద, మత్సర, ద్వేషాలను వదిలి వేయమని ఇంకా ప్రేమను పంచమని చెప్పారని స్వామీజీ గ్రహించారు. తనకు పాదనమస్కారం చేయుటలో భక్తులకు ఆనందం లభిస్తే, ఆనందాన్ని తాను ఎందుకు కాదని అనాలి అనే భావన స్వామీజీకి కల్గింది. ఆ అయిదుగురు స్త్రీలు స్వామీజీకి పాదాలను తాకి నమస్కరించారు. స్వామి వారిని వారించలేదు.

ఆంజనేయులు తనకు కన్పించింది స్వప్నంలో కాదని ఆయనకు అనుభవమయింది. ఆంజనేయస్వామి మందిరానికి వెళ్ళేదారిలోనే, రాత్రి

ఆంజనేయులు ఏ చెట్టునుండి దిగారో ఆ చెట్టు కనిపించింది.

ఆంజనేయ స్వామి మందిరం చేరగానే పూజారి స్వామీజీకి ఒక కప్పునిండా పండ్లరసం ఇచ్చాడు. దానిని తనతో వచ్చినవారికి స్వామీజీ ఇవ్వబోతే, ఆ పూజారీ "అది మీ కొరకే. ఆంజనేయస్వామి రాత్రి నాకు స్వప్నంలో కన్పించి దాన్ని మీకే ఇవ్వమన్నారు. ఇతరులకు ప్రసాదంగా తయారుగా వున్నది తరగని" అన్నాడు స్వామీజీతో. స్వామీజీ ఆ ప్రేమరసాన్ని త్రాగి ఇతరులకు అవధులు లేని ప్రేమను పంచసాగారు.

(మిగతాది వచ్చే సంచికలో)

## నామమహిమ

**– సూర్యప్రకాశరావు(సాయిరాం),** *తాడేపల్లి గుడెం.*

*శ్రీసాయి నామం ఒక కోటి కరుణా సముద్రాల సంగమం. సాయి నామం శతకోటి పుణ్యక్షేత్రాలకే పుణ్యక్షేత్రం. సాయి నామం నిత్యం దేవతలు స్మరించే దివ్యతారకమంత్రం. సాయి నామం అమృతం సైతం కోరుకునే అమృతం. సాయి నామం స్వర్గం సైతం నివశించాలనుకొనే అద్భుత స్వర్గం. ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ఇహపరలోకాలలో విజయం సాధించాలంటే అందుకు ఒకే ఒక సులభమైన మార్గం సాయినామ స్మరణం.*

*సాయినామ సంకీర్తనతో దేన్నయినా సాధించవచ్చు. జబ్బుతో బాధపడే మనుషులు శ్రద్ధగా సాయినామస్మరణం చేస్తే ఆ జబ్బు ఖచ్చితంగా నయమైపోతుంది. సాయినామం మహిమాన్వితమైనది.*



# సాయి అభయప్రదాత

పూరుగంటి రామకృష్ణ ప్రసాద్



శ్రీసాయి దివ్యశక్తి సంపన్నుడు కాబట్టే ఈనాడు విశాల విశ్వంలోని మారుమూల ప్రాంతాలలో కూడా విస్తరించి, భక్తులను 'సాయి' అనగానే 'ఓయీ !' అని కాచి రక్షిస్తున్నారు. శ్రీసాయి తన ఉనికిని గూర్చి దాముఅన్నా అనే భక్తునితో చెప్పినది.

**"ఈ మానుష శరీరాన్ని విసర్జించి నప్పటికీ, సదా అప్రమత్తుడనై మిమ్ము కాపాడు కుంటాను. నా సమాధి నా భక్తులయొక్క సర్వకోర్కెలను తీరుస్తుంది. శాంతి సుఖాలను ప్రసాదిస్తుంది. నా సమాధి మీతో మాట్లాడుతుంది. మీ ఆలనా పాలనా చూస్తుంది. నేనెప్పుడు మిమ్మల్ని కాచి రక్షించడానికి సంసిద్ధుడను. నన్నే కోరినవారికి, నాకు శరణాగతులైన వారిని సదా కాపాడుతాను". "మీరు సప్తసముద్రాల కవతలివున్నా సరే నేను మిమ్మల్ని కాపాడుకుంటాను. భక్తజన సంరక్షణం నా దీక్ష. మీరు ఎక్కడైనా వుండండి.ఏమైనా చేస్తూ వుండండి. సదా సర్వదా నేను కనిపెట్టుకొనివుంటాను. మిమ్మల్ని విడిచిపుచ్చి నేను మనలేను. నదులు సముద్రములో కలిసినట్లు నాలో మీరు కలిసిపోతారు."**

“తల్లి తన పిల్లలను కాదనవచ్చును. సముద్రం నదులను వెనక్కి త్రిప్పి పంపవచ్చును. నేను మాత్రం మిమ్ములను విడవలేను. పక్షుల కాళ్ళకు వేటగాడు వల విసరి తన వద్దకు రప్పించుకున్నట్లు నేను నా భక్తులను నావద్దకు తెచ్చుకుంటాను. నన్ను నమ్మండి. ఈ మశీదులో కూర్చుని, ఎప్పుడూ అబద్ధమాడను.” మరొక మాట –

“నన్ను స్తోత్రాలతో పూజించ నవసరము లేదు. అష్టోత్తర, సహస్రనామపూజ లనవసరము. భక్తి శ్రద్ధలతో ఏకాగ్ర చిత్తంతో ‘సాయి’ అన్నవారిని సదా రక్షించుట నా కర్తవ్యం. బాధ్యతలను విస్మరించను. నన్ను నమ్మండి. నమ్ముకున్నవారిని నట్టేట్లో ముంచేవాడు కాడీ సాయి” అని అభయ ప్రధానం చేసిన సాయి తన మాటలను నిలబెట్టుకుంటున్నారు.

## శ్రీ సాయి అభయప్రదానం

1. నేను మీ అంతర్యామిని, మీ హృదయ మందిరాలలో వున్నాను. సర్వజీవులలో శ్రీసాయి వున్నాడు. ఈ చరాచర ప్రపంచం శ్రీసాయి నిలయం. ఈ విశ్వాన్ని నడిపేవాడను, నిర్వహించువాడను నేను, సర్వజీవరాసులు చీమ, దోమ ఒకటేమిటి సర్వం ఈ సాయియే. నా దేహమే ఈ అఖండ ప్రపంచం.
2. ముందుగా ఒకసారి నా పేరును “నువ్వు” అనే భ్రాంతిని మరచిపోతే, అక్కడ వున్నదెవరు? నీది కాని ఆ పరమాత్మ స్వరూపమైతే, నీతో... నీ పేరుతో వున్నదీ ఈ సాయే కదా ! జాగ్రత్తగా ఆలోచిస్తే ఈ మాటలు నీ కర్థమౌతాయి. సత్యం గోచరించి సర్వేశ్వరుడవౌతావు.
3. నన్ను సర్వదా గుర్తించుకో. నీ జీవితమే నాదనుకుంటే, ఈ సాయి తత్వం అర్థం చేసుకోగల్గుతావు. ఆధ్యాత్మిక మార్గంలో గమ్యమొంది ఆ దైవమై భాసిల్లుతావు.



4. ఈ శరీరమే ‘సాయి’ అనుకుంటే చాలా పొరబాటు. ఈ సాయి సర్వవ్యాపి. జల, పృథ్వి, వాయు, రాకాశ తేజః స్వరూపుడైన సాయిని కనిపించే కాస్త శరీరముగా తలచేవారికి ‘శ్రీసాయి’ అంటే... బొత్తిగా తెలియదు.
5. నా నివాసం నీ హృదయం. నీలో వున్న నన్ను అనుక్షణం దర్శించి, తరించు.
6. సమదర్శియై, సర్వజీవులలో నన్ను దర్శించువారికి శ్రీసాయి ‘సర్వాంతర్యామి’ తత్త్వం గోచరిస్తుంది.




**On 20th April, 2008 Sri Sai Baba appeared in form of aarathi in the hand of Shastry Poojari while performing Pranaprathista in the presence of His Holiness Sri Sri Sri Vidyanarayana Theertha Swaminaha**

# సోదరి

రచన : **సాయిక్రిష్ణ**



తనతోపాటు తన తల్లి గర్భాన్ని పంచుకొని జన్మించిన తోబట్టువైన ఆడబిడ్డను సోదరి అంటారు.

కాని తల్లెవరో... తండ్రెవరో... అసలు ఎపుడు... ఎక్కడ జన్మించాలో తెలియని అయోని సంభవుడు... అవతారమూర్తి అయిన శ్రీషిర్డీసాయినాథునికే సోదరి కాగల్గిన ఆ అదృష్టవంతురాలు... బాయిజాబాయితల్లి.

ముమ్మాటికి ఆ తల్లి జన్మ ధన్యం. కాకుంటే సాక్షాత్తు పరమేశ్వరుడే అయిన సాయీసుని సోదరి స్థానం పొందగల్గుతుందా?

అయినా అంతటి అదృష్ఠవంతురాలు... పుణ్యమూర్తి అయిన బాయిజాబాయి తల్లి చరిత్ర ఆమెతోనె ముగిసిపోయిందా?... అంతరించి పోయిందా?... అనిపిస్తుంది.

లోకనాథుడైన సాయినాథునికే సోదరి కాగల్గిన ఆ మహాతల్లిని స్మరించుకోవటం మాట ఎలావున్నా... అసలా తల్లిని విస్మరించారా అనిపిస్తుంది... ఏ షిర్డీ యాత్రికుడైనా.

కాకుంటే.. నేడు ప్రపంచస్థాయిలో ప్రత్యేక స్థానం కల్గి... నిత్యం



వేలాది లక్షలాదిమంది భక్తుల నీరాజనాలందుకుంటున్న సాయినాథుని సంస్థానంలో... ఆ శ్రీనాథుని సోదరి స్థానం పొందిన ఆ మహత్మ్యం స్థానం ఎక్కడ? ఇది ఏ సాయిభక్తునికైనా కలిగే సందేహం.

అవునూ... అసలీ బాయిజాబాయి ఎవరు? ఈ చర్చంతా ఎమిటనిపిస్తుందా?

అవును... ఆమె స్థానం మాట ఎలా ఉన్నా, ఆమెను గురించి తెలుసుకోవటం, గుర్తుచేసుకోవటం ఉత్తమోత్తమం.

బాబాగారు చాంద్‌పాటిల్ మేనల్లుని పెండ్లి సందర్భంగా ఆ పెళ్ళి బృందంతో రెండవసారి షిర్డీలో కాలుమోపారు.

పెళ్ళివారితోపాటు ఖండోబా మందిరం దగ్గర బండి దిగగానే ఖండోబామందిర పూజారి మహల్సాపతిగారు బాబాగారిని గుర్తించి ఎదురెళ్లి... “ఆవో! సాయీ!” అంటూ ఆహ్వానించారు.

ఆనాడు అలా మహల్సాపతిగారి ద్వారా “సాయి” అని బాబాగారికి నామకరణం జరిగింది. అది మొదలు ఆయన సాయిగా పిలువబడ్డారు... పేరుపడ్డారు.

ఆ విధంగా ఛాంద్ పాటిల్ పెళ్లి బృందంతో రెండవసారి షిర్డీలో కాలుమోపిన బాబాగారు షిర్డీలోనే నిలిచిపోయారు.

అపుడు ఆ మారుమూల కుగ్రామంలో బాబాగారిని ఆదరించిన వారు... మహల్సాపతి ఆయన స్నేహితులు కాశీరాం... దర్జీ అప్పా మరియు జోగ్.

ఈ మిత్రబృందంతోపాటు బాబాగారిలో దివ్యత్వాన్ని గుర్తించిన వారిలో బాయిజాబాయిగారు, ఆమె భర్త ముఖ్యులు, సంపన్నులు కూడా.

అసలీ బాయిజాబాయి ఎవరనుకుంటున్నారా... బాబాగారి చరిత్రలో ఆయనచేత మేనల్లునిగా ఆదరించి, లాలించబడ్డ తాత్యాగారి తల్లిగారు.

అప్పటిలో బాబాగారికి షిర్డీలో ఒక స్థిరనివాసం అంటూ లేదు. అంతే కాకుండా ఏప్పుడూ గ్రామం చుట్టూ ఉన్న అడవిలో తిరుగుతూ ఆయనకు మనసున్నచోట కూర్చుని ధ్యానమగ్నుడై ఉండేవారు.

అలా అడవిలో తిరుగుతూ తనలో తానే ఏదేదో మాట్లాడుకుంటూ ఒక్కొక్కప్పుడు విపరీతమైన కోపంగా... మరొకప్పుడు ఎంతో ప్రశాంతంగా... ప్రసన్నంగా ఉంటూ... విచిత్రంగా ప్రవర్తించే ఆయనను షిర్డీవాసులు ఓ పిచ్చి ఫకీరుగా భావించేవారు.

అడవుల వెంట తిరిగే ఆ పిచ్చి ఫకీరు ఆకలి గుర్తించిన మహాతల్లే బాయిజాబాయి తల్లి.

యిప్పుడు... ఎక్కడ వుంటాడో, ఏ పొదలమాటున, గుట్టల మాటున, ధ్యానమగ్నుడై వుంటాడో తెలియని ఆ పిచ్చి ఫకీరు ఆకలి తీర్చటానికి రొట్టె ఓ బుట్టలో పెట్టుకొని ఆ బుట్ట నెత్తిన పెట్టుకొని ఆయన కోసం మైళ్ళకు మైళ్ళు అడవి అంతా తిరుగుతూ గాలించి... ఎలాగైనా ఆయన ఉన్న స్థలం గుర్తించి... ఆయనను బ్రతిమాలి ఆహారం తినిపించేది.

ఒక్కొక్కప్పుడు ఆయన ఏ పొదలోనో ధ్యానమగ్నుడై వుంటే ఆయన ముందు తను తీసుకెళ్ళి ఆహారం ఉంచి, ఆయన తపోదీక్షకు భంగం కలుగకుండా ఆయనంతట ఆయన కళ్ళు తెరిచేవరకు ఓపికగా ఉండి, ఆయన కళ్ళు తెరిచిన



తరువాత ఆయనకు రొట్టెలు పెట్టి, ఆయనచేత తినిపించి, అప్పుడు ఇంటి ముఖం పట్టేది.

ఈ విధంగా ఆమె ఆయన ఆకలి తీర్చటమే తపస్సుగా ఆచరించింది.

ఆమె తపస్సుని పరీక్షించటానికా అన్నట్లు బాబాగారు గ్రామంచుట్టూ వున్న అడవిలో ఒక రోజు ఒక వైపు, మరొ రోజు మరో వైపు వెళ్ళేవారు. ఒక్కోరోజు ఎన్నో మైళ్ళదూరం వెళ్ళేవారు. అంతదూరాన పొదలమాటున ధ్యానమగ్నుడై పోయేవారు.

అయినా అతణ్ణి ఆయన పరీక్షలకు తట్టుకొని నిలబడి, ఎంతో ఓపికగా అడవంతా గాలించి బాబాగారిని చేరుకొని ఆయన చేత రొట్టెలు తినిపించేది. అపుడుగాని ఆ తల్లి మనసు శాంతించేది కాదు.



ఆ విధంగా ఆయన ఆకలి తీర్చటమే తపసు నాచరించిందా తల్లి.

ఆమె కష్టం చూడలేక, ఆమె శ్రమను తొలగించాలనే సంకల్పంతో బాబాగారు అడవిలో తిరగటం మానేసి గ్రామంలో భిక్ష చేయటం మొదలుపెట్టారు. అది కూడా ప్రథమంగా బాయిజాబాయి ఇంటివద్ద.. ఆ తల్లి చేతి భిక్షనే స్వీకరించేవారు బాబాగారు.

ఆ విధంగా బాయిజాబాయి తల్లి ఆదిభిక్షువైన ఆ సాయి పరమేశునికి తన చివరి శ్వాసవరకు తపస్సులా భిక్షపెట్టి ధన్యురాలైంది. సాక్షాత్తు ఆ సాయి

పరమేశునికి సోదరి కాగలిగింది.

ముల్లోకాలకు భిక్ష ప్రసాదించే ఆది దేవునికే భిక్షపెట్టి ఆయన చేత సోదరిగా భోదించబడ్డ ఆ తల్లి జన్మ ధన్యమైనది కదా!

ఆ అనుబంధమే ఆమె కుమారుడైన తాత్యాను బాబాగారికి మేనల్లుని చేసింది. తన పెళ్ళివరకు తాత్యా బాబాగారితో పాటు మశీదులోనె నిద్రించేవాడంటే.. ఆ మామా అల్లుళ్ళ అనుబంధం ఎంత అమోఘమో... అపూర్వమో ఆలోచించండి.

అటువంటి ఆ మహత్యం తపస్సు ఫలితంగా, వరంగా తాత్యా ప్రాణాలు కాపాడటానికి తన ప్రాణాన్నే పణంగా అర్పించి సమాధినొందారు సాయినాథుడు.

కాకుంటే తన శరీరాన్ని ఈ భూమి మీద తన భక్తులమధ్య వొదిలేసి మూడు రోజుల పాటు ఊర్ధ్వలోకాలలో సంచరించి దైవకార్యాలు చక్కపెట్టుకొని మూడవరోజు తిరిగి తన శరీరంలో ప్రవేశించగల్గిన ఆ సాయిదైవానికి మరణమేమిటి?... కేవలం ఆ బాయిజాబాయి తల్లి ఋణం తీర్చుకోవటం తప్ప. అటువంటి ఆ మహాతల్లిని గుర్తుంచుకోవటం స్మరించుకోవటం యొక్క అవశ్యకతను గురించి ఇంకా చర్చించాలా !

నిత్యం సాయిభక్తులు ఆ మహాతల్లి బాయిజాబాయిని దర్శించుకొని... ఆరాధించే విధంగా ఓ ఆలయం ఉంటే ఎంత అద్భుతంగా ఉంటుందో...

సాయిరాం



# శిలధిపుర - నివాస సాయినాథ

**కంచిరాజు సాయిరాం,** S R K Puram. Hyderabad



ఆ:వె: ప్రాస యతులతోడ పద్యముల్ చెప్పనీ
దాసుని తరమౌనె దాసపోష
కవిత వ్రాయగలము కవి ఎట్లవగలదు
శిలధిపుర నివాస సాయినాథ !

ఆ:వె: చేరి కలుపు మొక్క చేలనే చెరచును
పులుపు తగినంత పాలు చెడును
చంచల మది వలన చిత్తమే చెడునేమొ
శిలధిపుర నివాస సాయినాథ !

ఆ:వె: గోష్ఠమందు గట్టు గోగణములవలె
పంజరమున బెట్టు పిట్టలవలె
ఖర్మవలన మేము ఖైదీలమయితిమి
శిలధిపుర నివాస సాయినాథ !

ఆ:వె: కాలకూట విషము కొంచమయినగాని
ప్రాణముల హరించి పారవేయు
కుచ్ఛితుడొక డయిన కలుగు అపాయము
శిలధిపుర నివాస సాయినాథ !

ఆ:వె: తల్లిబిడ్డ నెత్తి లాలించకున్నచో
బిడ్డ సుఖము నెట్లు బడయగలదు
తమరులేని జీవిత రథమెట్లు నడుచు
శిలధి పుర నివాస ! సాయినాథ !

# శ్రీశ్రీశ్రీ గణేశనాథ్ మహారాజ్ సాయిబాబా గూర్చి చేసిన ప్రసంగం

(గత సంచిక తరువాత భాగం)

తెలుగు అనువాదం : మణి



పరమాత్మ జీవుని సృష్టిస్తాడు, వంద ఏళ్ళ ఆయువు నిచ్చి వెళ్ళి వంద సంవత్సరాలు ఈ శరీరంలో సుగంధ పరిమళాలు ప్రకాశం ఉండేలా నీపేరు ప్రఖ్యాతుల వెలుడు (కాంతి)...వ్యాపించేలా, నింపిపెట్టు అని చెప్పాడు. కాని జీవుడు ఈ ప్రపంచంలోకి వచ్చి పరమాత్మను మరిచిపోయాడు. పరమాత్మకు దూరమై పోయాడు. కఠిన వచనాలతో ఇతరులను అసహ్యించుకుంటూ జాతి మత భేదభావాల కారణంగా తమస బుద్ధితో పరమాత్మకు దూరమైపోతారు మొదటి రకం. రెండం తెగవారు, భోగవిలిసాలలో మునిగిపోతారు కాని బాబా భక్తుడు (ఇవాళి) ఈనాటి కార్యక్రమాన్ని పరిపూర్ణంగా ఉండాలని చెప్పారు కదా నిండుగా ఉండేలా ఏర్పాటు చేస్తారు. మనం లక్షల రూపాలను కల్లు సారాల వంటి మత్తుపదార్థాలపై ఆటపాటలపై చేయకూడని వాటిపై (నిషిద్ధమైన) ఖర్చు చేస్తాం. పదిరూపాయలు ఇటువంటి కార్యక్రమాలపై ఖర్చుచేస్తే మనకు మళ్ళీ ధనం లభిస్తుంది. అయితే ఏదో లభిస్తుంది కదా అన్న ఆశ ఉండకూడదు. ఈశ్వరుడు అన్ని చోట్లా నిండి ఉన్నాడు. ఈశ్వరుడులేని చోటంటూ లేదు. మరి ఆ ఈశ్వరుని రూపాన్ని ఎలా చూడగలరు? ఇవాళ ఇక్కడ నాదబ్రహ్మ శద్దబ్రహ్మ పరమాత్మ అంతా కలసి నృత్యం చేయటం చూచి మనం జీవ సృష్టిని మరిచిపోయం. ఇలా సత్కర్మలు ఉంటే మన మనసులలోని చింత



భేదభావం తొలగిపోతాయి ప్రపంచంమంతా పరమాత్మయొక్క సంతానమే. ఆ పరమాత్మనే స్మరిద్దాం మన సాయి పరివారం ఈసాను తిరగేస్తే సాయిని తిరగేస్తే బీజోలహం సర్వభూలేషు పరమాత్మే ప్రపంచ సృష్టికి బీజం మనం బాబానే అనేక ప్రశ్నలు అడుగుతుంటాం మీరూ అడుగుతారు. బాబా జవాబు అందరి ప్రభువు ఒక్కరే (సబ్‌కామాలిక్ఏక్) అని బీజరూపంలో చూచినా వృక్షరూపంలో చూచినా భక్తితో సుగుణరూపంలో చూచినా నిర్గుణరూపంలో చూచినా అంతే.

బ్రహ్మ(అంటే) ఈశ్వరుడు సత్యం జగత్తు మిధ్య అని అంటారు. ప్రపంచమంతటా ఈశ్వరుడు నిండి ఉన్నాడు. ఈసా (ఏసు) అని అనచ్చు సాఈ అని అన్న అనవచ్చు గోమాత పాలను ఇస్తుంది. పాలనుండి నేయిని తీసుకోవటం మీపని అట్లే బాబా వేదశాస్త్రాల జ్ఞానం మీకిచ్చారు, అందులోని సారాన్ని మీరు ప్రపంచానికి అందివ్వాలి. గురువు యొక్కపదవి స్థితిగతులను శిష్యుడు తెలుపగలడు శిష్యునికి ఆ అధికారం ఉంది. ఇది బాబా యొక్క ఏ అవతారమని మీరు చెప్పగలరు. సాయి బాబా చరాచర జగత్తు యొక్క ఉత్పత్తి స్థితి ప్రళయాలను చేసేవారు, వారిని హరి అనవచ్చు హరుడని అనవచ్చు నిర్గుణుడని అనవచ్చు సగుణడని అనవచ్చు. సాయి చరచరాలకు జగత్తుకు అది గురువు బాబా యందు భక్తితో మన జీవితాలను ఉద్ధరింపచేసుకోవాలి. బాబా స్థిరిపచేసినా దానిని మనం గుర్తుంచుకోవాలి. చివరగా నేను ఒక దృష్టాంతాన్ని వినిపిస్తానూ ఒకసారి అక్బరు చక్రవర్తి దర్బారు సమాప్తి అయాక అక్కడ బీర్‌బల్ ఉండగా, ఒక పండితుడు అక్కడికి వచ్చి, నేను వేదాలను వాదించాలని వచ్చాన్నన్నాడు. అక్బరు సభ సమాప్తి అయిందని చెప్పాడు.

అప్పుడు పండితుడు  నేను చాలా దూరం నుండి వచ్చాను అని అన్నాడు. అక్బరు బీర్‌బల్‌తో నీవు ఇతనితో చర్చించగలవా అని అడిగాడు బీర్‌బల్ చర్చిస్తాన్ననాడు, రాజుగారు సరేఅన్నారు. పండితుడు బీర్‌బల్ ఒకని ఎదుటి ఒకరు నుంచుని ఉన్నారు. బీర్‌బల్ ఏమిటి అడగ తలచుకున్నావు అని పండితుని అడిగాడు. పండితుడు సరళమైనవి వంద ప్రశ్నలను అడగాలా లేక అత్యంత కఠినమైన ఒక్క ప్రశ్నను అడగాలా అని  అన్నాడు. అప్పుడు బీర్‌బల్ అసలే పండితుడు కదా సరళమైనవని పదివేవో ప్రశ్నలు వేస్తూనే ఉంటాడు అని ఆలోచించి అత్యంత కఠినమైన ఒక ప్రశ్ననే అడుగు అని అన్నాడు. పండితుడు విత్తనం ముందా వృక్షం ముందా అని ప్రశ్నవేశాడు బీర్‌బల్ విత్తనం అని సమాధానమిచ్చాడు. అదెలాగ? అని పండితుడు అడిగాడు. అప్పుడు బీర్‌బల్ మీరు ఒక్క ప్రశ్ననే అడగాలి గాని రెండవ ప్రశ్నను అడగరాదు అని అన్నాడు ఇలాగే బాబాను ప్రశ్నించగా బాబా (సబ్‌కామాలిక్‌ఏక్‌హై) అందరి ప్రభువు ఒక్కరే రెండవ ప్రశ్న అడగరాదు అని అన్నారు. బాబా ఆది గురువు వారే సచ్చిదానందులు భక్తితో ఆరాధిస్తే మిమ్మల్ని ఆశీర్వదిస్తారు. మనం అనేక సిద్ధులను సంపాదించుకుని అనేక చమత్కారాలను చేసి ఉండవచ్చు కాని బాబా ముందు అవన్నీ తుచ్ఛమైనవి. ఎవరి మనుసులలో బుద్ధిలో బాబా ఉన్నారో వారే అందరిలో గొప్పవారు. ఎవరి మనసులో బాబాలేరో వారు గొప్పవారు కారు. మనం భక్తి శ్రద్ధల ద్వారానే బాబాను తెలుసుకోగలం.

ప్రపంచం యొక్క సంపద అంతా పరమాత్మదే అలాంటిప్పుడు మీకు మొహ మమకారా లెందుకు? లోభం ఎందుకు? ఎవరి  గురించో ఎందుకు చింతన చేస్తావు? ఎవరి గురించీ ఎం ఆలోచించకు. శరీరం మనసు ధనం



అన్నీ బాబాకు సమర్పించి  మీరు ఆనందంగా సచ్చిదానంద సద్గురు సాయినాథ మహరాజ్‌కీ జై అని భజన చేయండి.

శ్రీసచ్చిదానంద సద్గుగురు సాయినాథమహారాజ్‌కీ జై.

శుభం





# శ్రీ సాయిరాం

-పర్వతం రేవతీ ప్రసాద్, ప్లాటునెం. 115, ఢిపెన్స్ కాలనీ, సైనిక్‌పురి, సికింద్రాబాద్ - 500 094

1. ఓం సాయి ఓం సాయి అనవో మనసా ।
సాయంటే సర్వాంతర్యామి యని తెలుసా ।
తెలియదంటె అలుసనీ తెలియవె మనసా ।
మనసా । ఓ మనసా । మన సామర్థ్యమేమి ? ।     ॥ ఓం ॥

2. ఆధ్యాత్మిక సాధనమే అసలు మూలధనము ।
'నేనెవరిని' తెలుసుకొనుటె పరిశోధనము ।
పరుల ధ్యాస మానుకో మనసా మనసా ।
పరమాత్మను ధ్యానించుకొ నిలిపి మరీ శ్వాసా ।     ॥ ఓం ॥

3. మానవదేహాలయం మాధవునికి నిలయం ।
మాధవుడే లేకుంటే అది హాలాహలమయం ।
పరులము మనము భక్తిపరులము మనము ।
సాయి దర్శనానికై వేచియున్న కాపరులము ।     ॥ ఓం ॥



# సాయినాథ ఉవాచ

సేకరణ - వ్యాఖ్యాత సాయిదాసానుదాసు
**సురేంద్రబాబు,** కోవూరు, నెల్లూరుజిల్లా

***(శ్రీసాయివాక్కులు బ్రహ్మవాక్కులు! శ్రీసాయి షిరిడీలో సశరీరులుగా మెలిగిన 60 సం॥రాలలో వారి వాచ అసంఖ్యాకమైన వాక్కులు వెలువడ్డాయి. వాటిలో ఆణిముత్యాల్లాంటి కొన్నింటిని ఏర్చి, సందర్భోచిత వ్యాఖ్యాన సహితంగా దిగువ ఇవ్వడం జరిగింది, అవధరించండి)       (గత సంచిక తరువాయి భాగము)***

***(250) "చిల్లపెంకునైనా గురువుగా ఎంచుకుని, పూజించుకో, నీవు గమ్యంచేరతావో, లేదోచూడు!"***

ఒక ధనికురాలు పళ్లెం నిండా రూపాయి నాణాలుపోసుకొని, బాబా ముందుకొచ్చి, నిలబడేది. బాబా ఆమెకేసి కూడ చూచేవారుకాదు, ఇలా రెండు రోజులుగడచింది. మూడోరోజు ఆమెబాబాతో, "బాబా నేను గురువుకోసం వచ్చాను. ఈ దక్షిణ తీసికొని, నాకు ఉపదేశమివ్వండి'' అని ప్రార్థించింది. అప్పుడు బాబా, "అమ్మా ! ఎవ్వరూ తనకు తాను గురువుగా ఎంచుకోడు. నీవే నీ గురువును తెలిసికోవాలి. చిల్లపెంకునైనా గురువుగా ఎంచుకుని పూజించుకో. గమ్యంచేరతావో, లేదో చూడు" అన్నారు.

***(251) "ఈ పొలానికి కంచె లేకపోతే, మేకలు లోపలికి వచ్చి ధ్వంసం చేస్తాయి!"***



శ్రీస్వామిశరణానందజీకి బాబా స్వప్నంలో కనబడి పై మాటలన్నారు. దీని అంతరార్థం, ఆధ్యాత్మిక మార్గంలో మనకు వచ్చే పుణ్యానికి, వ్రతనియమాలనే కంచె వేసుకొని, కాపాడుకోకుంటే, మనలోని అహంకారమనే మేకలు, ఆ పుణ్యాన్ని కాస్త కబళించి వేస్తాయని !

***(252) "నా పద్ధతి మిక్కిలి విశిష్టమైనది. ఈ ఒక్కకథను జ్ఞాపకముంచుకో, నీకు బాగా ఉపయోగపడుతుంది."***

***(253) "సాధనా చతుష్టయంగానీ, శాస్త్ర షట్కంగానే అక్కరలేదు. నాపై విశ్వాసముంచు, చాలు?"***




శ్యామా చెప్పిన రాధాబాయి దేశ్‌ముఖ్ కథనువిని, హేమాడ్‌పంత్ మశీదు కొచ్చాడు. బాబా ఆ కథ యొక్క విశిష్టత గూర్చి చెప్పారు తమ పద్ధతికి ఇతరులపద్ధతికి చాల తేడా ఉందని, తమ పద్ధతి మిక్కిలి విశిష్టమైనదని చెప్పారు. రాధాబాయి కథ నొక్కదాన్ని జ్ఞాపకముంచుకుంటే చాలునని, అది తనకంతో ఉపయోగపడ గల నాలుగు విధాలైన సాధనాలుగానీ, ఆరుశాస్త్రాల ప్రావీణ్యతగానీ అక్కరలేదని, గురువునందు నమ్మకం ఉంచుకొని, వారిని సకలదేవతా స్వరూపునిగా భావించి. కొలుచుకుంటే చాలునని, తప్పక గమ్యంచేరగలడని బాబా హేమాడ్‌పంత్‌కు చెప్పారు.

***(254) "ఈ పాదాలు ముదుసలివి, పవిత్రమైనవి. ఇక నీ కష్టాలు తీరిపోయాయి. నా యందే విశ్వాసముంచు, చాలు."***

***(255) "కొడుకు చనిపోయాడని ఏడుస్తాడెందుకు? వాడినే అతని భార్య గర్భంలో ప్రవేశపెట్టాను!"***

అక్కల్‌కోట న్యాయవాది సపత్నేకర్ ఎన్నిసార్లు బాబాను దర్శించాలని మశీదులోని కెళ్లినా, బాబా అతనిని బయటికి గెంటేశారు. రెండు మూడు రోజులు ప్రయత్నించి ఇంటికి వెళ్లిపోయాడు. రెండవసారి అతని భార్యను వెంట బెట్టుకొని శిరిడీ వచ్చాడు. బాబా అతని భార్యను లోనికనుమతించారుగానీ, సపత్నేకర్‌ను బయటకు గెంటేశారు. తను లా కాలేజిలో చదువుతున్నప్పుడు, తన సహవిద్యార్థిషేవాడే ముందు బాబాను నిందించిన ఫలితమే దీనికి కారణమని తెలుసుకున్నాడు. పశ్చాత్తా



పంచెంది బాబా ఒంటరిగా ఉన్నప్పుడు,వారి పాదాలపైపడి క్షమాపణ వేడుకున్నాడు. బాబా అతనిని కరుణించాడు. ప్రక్కనే కూచుని తమ పాదాలొత్తు తున్న గొల్లపడుచుతో సపత్నేకర్ జీవిత చరిత్రనంతా చెప్పారు. ఆమెతో "కొడుకు చనిపోయాడని ఏడుస్తాడెందుకు? వాడిని నేను అతని భార్యగర్భంలో ప్రవేశపెట్టాను. చింతించవద్దని చెప్పు" ! అన్నారు. తర్వాత అతని కష్టాలన్నీ తీరిపోయాయని, తమ పాదాలనే నమ్ముకొని ఉండమని చెప్పారు.

***(256) "నేనొకచోటుకు వెళ్తే అక్కడి భూస్వామి తమనొకతోటను మొలిపించి, దాని గుండా గట్టి కాలిబాటను వేస్తే తప్ప నన్నువెళ్లనివ్వలేదు. నేనారెండు పనులు పూర్తిచేశాను"***

ఇది అంతరార్థంతో కూడుకున్న ప్రవచనం. భూస్వామి అంటే



భగవంతుడు. తోటమొలిపించడమంటే చతుర్విధ పురుషార్థాలు బోధించే ఆశ్రమాలు నెలకొల్పడం. గట్టిబాట అంటే స్థిరమైన ముక్తి మార్గం. దీని భావం భగవంతుడు తమనొక సద్గురువుగా మెలిగి, భక్తులకు ముక్తిమార్గం ఏర్పరచమని ఆదేశించినట్లు, బాబా తమ భక్తులకు చెప్పారు.

***(257) "భగవంతునిపై దృఢ విశ్వాసమున్న వాళ్లెవరూ ఏదీకోరరు !"***

బాబా ఈ మాటలు దాదాసాహెబ్ ఖపర్దేతో అన్నారు. అతను ఈ మాటలను తన డైరీలో పొందు పరిచాడు. భగవంతునిపై పూర్తి విశ్వాసమున్నవారికి ఏ కోరికలు ఉండవని, అన్నీ భగవంతుడే సమకూర్చుతారని బాబా భావం.



***(258) "రక్షించువాడే చంపుతాడు, చంపువాడే రక్షించువాడు!"***

ఒకసారి బాబా మశీదులో మాంసపు పులావు వండుతున్నారు. అప్పుడు మిరీకర్ అనుభక్తుడు బాబాతో, "బాబా, ఏమిటీ జీవహింస? మన పొట్టను నింపుకోడానికి, ఇతర జంతువులను చంపడం పాపంకాదా?" అని ప్రశ్నించాడు. అప్పుడు బాబా, "చంపేదెవరు? రక్షించేదెవరు? అంతా ఒక్కడే! రక్షంచువాడే చంపుతాడు. చంపువాడే రక్షిస్తాడు !" అన్నారు. సృష్టి, స్థితి, లయకారకులు ముగ్గురూ ఒక్కరేనని, వేర్వేరుకారని బాబా భావం!

***(259) "నీవు నాలుగిచ్చినా నేను పొందిందొకటే !"***

సాయిబాబా దక్షిణ కోరినప్పుడు బి.వి.దేవ్ వారికొక బంగారు సవర నాణాన్ని సమర్పించాడు. బాబా మళ్లీ మళ్లీ అడిగి మరి మూడు సవరనాణాలను స్వీకరించి "ఒక్కటి స్వీకరించాను" అన్నారు. బి.వి.దేవ్ "అదేమిటి బాబా, నేను నాలుగిచ్చాను" అన్నాడు. అప్పుడు బాబా, "నీవు నాలుగిచ్చినా నేను పొందిందొకటే" అన్నారు. బి.వి.దేవ్‌కు ఈ మాటలు అర్థంకాలేదు. బాబా "అర్థమౌతుందిలే పో !" అన్నారు. అంతఃకరణాలైన మనస్సు, బుద్ధి, అహంకారము, చిత్తము, భగవంతునికి (సాయికి) సమర్పించినా, వారు పొందేది ఆత్మ ఒక్కటేనని దీని భావం !

**(260) *"నా భర్త ఎప్పుడూ నాతోనే ఉంటూ పలకడు, ముఖం చూపించడు! నేనేం చేసేది?"***

ఒక గృహిణి తన భర్త ఇల్లు విడచి వెళ్లిపోయి, మూడేళ్లు దాటిందని శోకిస్తూ బాబాకు మొరపెట్టుకుంది. ఇదివిని బాబా తన భర్త తనతో ఉంటూనే తనతో పలకడని, ముఖం కూడ చూపించడని, తన ఎవరితో చెప్పుకోవాలో తెలియడంలేదని, తనూ శోకించడం మొదలుపెట్టాడు. ఇది చూచి ఆమె విస్తుపోయింది.బాబాకు భర్త ఉండట మేమిటో. ఆమెకు అర్థంకాలేదు. కొంతకాలం తర్వాత, ఆ గృహిణి భర్త తిరిగి వచ్చాడు. కానీ ఆమెతో మాట్లాడటం మానకున్నాడు. కనీసం ఆమె ముఖం కూడ చూచేవారుకాదు. అప్పుడామెకు బాబా మాటలు గుర్తుకొచ్చాయి. బహుశా బాబా తన భర్త ప్రవర్తన గురించే అప్పుడు మాట్లాడాడేమోనని అనుమానించింది. మరి కొంతకాలానికి ఆమె భర్త చనిపోయాడు. ఆమె ఆధ్యాత్మిక చింతనతో గడపసాగింది. ఆమె ఒకసారి బాబా సన్నిధిలో కూచుని ఉన్నప్పుడు, బాబా మాటలలోని అంతరార్థం ఆమెకు



అర్థమైంది. మన నిజమైన భర్త భగవంతుడేనని, అతడు ఎప్పుడూ మనతోనే ఉన్నా, మనకు కనిపించడు, మాట్లాడడు అని!

**(261) *"రెండు వేలపిడకలు పేర్చివాటిపై ఈ శరీరాన్ని కాలుస్తున్నా మనం చలించకూడదు!"***

కమ్మరి భక్తుడు కొలిమిలో పడినప్పుడు, సాయిధునిలో చెయ్యి పెట్టిబిడ్డను బయటికి తీసి, రక్షించారు. సాయిచెయ్యి బాగాకాలి గాయమైంది. ఇది చూచి తాత్యాకోతే పాటిల్ కంటి తడిపెట్టాడు. అప్పుడు బాబా, "తాత్యా ఎందుకేడుస్తావ్? రెండు వేల పిడకలు పేర్చి వాటిపై ఈ శరీరాన్నుంచి కాలుస్తున్నప్పుడు కూడ మనం చలించకూడదు" అన్నారు.

**(262) *"నా దగ్గరకు వచ్చే వన్నీ బోర్లించిన కుండలే !"***

కోపర్‌గావ్ స్టేషను మాస్టరు సాయినొక పిచ్చి ఫకీరుగా భావించి, విమర్శిస్తూండేవాడు. దాసగణు ఒకసారి శిరిడీకి బయలుదేరి, కోపర్‌గావ్ వచ్చినప్పుడు అతని సమక్షంలో సాయిని తీవ్రంగా విమర్శించాడు. దాసగణు ఇది సహించక, అతని నొకసారి సాయిని దర్శించమని, వారిని దర్శించకుండ చెప్పుడు మాటలు విని వారిని విమర్శించడం మంచిది కాదని గట్టిగా చెప్పారు. స్టేషన్ మాస్టర్ అందు కొప్పుకొని దాసగణుతో శిరిడీ వచ్చాడు. వీరు మశీదు చేరేప్పటికి, సాయికుండలనన్నింటిని బోర్లిస్తూ కన్పించారు. స్టేషన్‌మాస్టరు కుండలనలా ఎందుకు బోర్లిస్తున్నారని సాయినడిగాడు. సాయి, "నా దగ్గర కొచ్చేవన్నీ బోర్లించిన కుండలే" అన్నారు. బోర్లించిన కుండలలో ఏమీ ఉండదు. ఖాళీగా ఉంటాయి. అంటే మొదట సాయి దగ్గరకు వచ్చేవారందరూ బోర్లించిన

కుండలవలె, వారి మస్సులో సాయిపై భక్తి విశ్వాసాలుండవు. స్టేషను మాస్టరు ఇది తెలుసుకొని, సాయిపిచ్చివాడు కాదని, మహాత్ముడని అర్థంచేసుకున్నాడు.

***(263) "దొంగల పేర్లు మాత్రం గుర్తుంచుకొని, వాళ్లు భోజనానికి కూర్చోగానే వారిని హతమార్చి, నాధనాన్ని నేను తెచ్చుకున్నాను."***

ఒకప్పుడు కొందరు దొంగలు తమ ధనాన్నంతా, దొంగలించడానికి వచ్చారని, వారిని ఆటంకపరచకుండ, ధనాన్ని తీసుకపోనిచ్చి, ఆ దొంగల పేర్లు మాత్రం గుర్తుంచుకొని, వాళ్లు భోజనానికి కూర్చోగానే, వారిని హతమార్చి, తమధనాన్ని తిరిగి తెచ్చుకున్నానని, బాబా భక్తులలో చెప్పారు. ఇది ఒక యోగసాధకుని కథ. బాబా తమ పరంగా చెప్పుకున్నారు.ధ్యాన, వివేక,వైరాగ్యలే బాబా దగ్గరున్న ధనం. రజోస్తమోగుణాల వల్ల ఉత్పన్నమయ్యే వివిధ సంకల్పాలే దొంగలు. వీటి ప్రభావం వల్ల మనస్సు చలిస్తుంది. అలా చలించిన మనస్సును ఆటంకపరచకుండ సాధకుడు శ్రద్ధగా గమనిస్తూ ఉండాలి. భోజనానికి కూచున్నప్పుడు అంటే అని సాధకుని లొంగ దీసుకోక పూర్వమే గుర్తించి, వివేకంతో వాటిని నాశనంచేయాలి. అప్పుడే తిరిగి మనం కోల్పోయిన ధ్యాన ధనం తిరిగి లభిస్తుంది.




అరవైముగ్గురు భక్తుల జీవితచరిత్ర - 207 పుటలు
వెల రూ.40/- ప్రతి ఇంట వుండవలసిన గ్రంథం.
సత్సంగంలో పంచండి. ప్రతులకు -

**సాయిభక్తమాల**

శ్రీ సాయిదర్శన్, దమ్మాయిగూడ,
హైద్రాబాద్ - 500 083




# అధ్యాత్మిక దర్శన్

- అందరూ గురువులు కాలేరు. తన్ను తాను ఎరిగి, తన శక్తిపాతముతో శిష్యుల మనోరథ మెరిగి, వారి ఇహలోక వాంఛలను తీరుస్తూ, అపరబ్రహ్మపదాన్ని, ఆనందాన్ని ప్రసాదించేవారే అసలు సిసలైన గురువులు కనుక ఆ గురువులకై మనం ఎంత తీవ్రాన్వేషణం గావిస్తామో, ఆ శ్రీగురువులు కూడా ఉత్తమోత్తమ శిష్యులకై అంత తీవ్రంగా వెతుకులాడుతుంటారు.
- భగవంతుని కరుణ మనమీద వుంటే, మహాత్ముల సందర్శనంతో తరిస్తాం. మహాపురుషుల సాన్నిధ్యంలో మమతామూర్తులమై ప్రకాశిస్తాం.
- ఈ భూమిపై జన్మించిన వారెందరో, వారి వారి కర్మఫలాలు పరిపక్వమైనందువల్ల పరిపక్వావధూతలై శాశ్వత కీర్తి ప్రతిష్ఠలను, ఆత్మసాక్షాత్కారాన్ని, దైవ సాయుజ్యాన్ని పొంది, సాటి, తోటి మానవాళిని తాము తరించి, తరింపచేస్తారు.
- ఆధ్యాత్మికతను అందుకోగలగడం నిజంగా అదృష్టం. అందరికి లభించదు. ఏ కొందరు అదృష్టవంతులో తమ జన్మ జన్మల పుణ్యవిశేషం చేత అటువంటి అదృష్టాన్ని పొందగలుగుతారు. ఆ కారణజన్ములు తమకు లభించిన అదృష్టాన్ని కర్మలో భాగంగా అనుభవిస్తూ, ఆశ్రయించినవారిని, అభాగ్యులను, ఆపన్నులను, శరణాగతి ప్రాణులను తమ ధర్మంగా వారిని రక్షించి, ధర్మప్రతిష్ఠాపనం గావిస్తారు.
- సాధకుడు ప్రతినిత్యము నామస్మరణం చేయాలి. ఈ నామస్మరణం ద్వారా మనిషి తనలోని విచారాన్ని, సమస్యలను, అసంబంధిత విషయాలపై

ఆసక్తిని దూరం చేసుకొని, క్షణకాలం దైవాన్ని కనుగుణంగా తన మనసును త్రిప్పి భయవిదూరుడౌతాడు.

ప్రతివ్యక్తి దైవ సూక్తులను, శ్రీగురుబోధనలను మనస్సునకు పట్టించుకొని, తద్విధంగా కనుక నిలిచినట్లయితే, ఆత్మాసాక్షాత్కారం, బ్రహ్మానందం కరతలామలకం. దైవధ్యానం చెయ్యండి. దైవరూపులై మెలగండి.

ప్రతి మానవుడికి శ్రీగురువు లవసరమౌతారు. నిజమైన శ్రీగురువులు తనను చేరిన వ్యక్తుల మనోస్థితిని బట్టి, వారి లక్షణాలను బేరీజు వేసుకుని, ఆ వ్యక్తిని ఆ విధంగా నడిపింపచూస్తారు.

నిజమైన శ్రీగురువులకు ధనకాంక్ష వుండదు. ఇహ పరాలపై గూడా ఆసక్తి ఉండదు. ముందు సమాజక్షేమం, ఆ తదుపరి లోకక్షేమం కోరేవారే తప్ప, వచ్చినవారిని నిలువుదోపిడి చేసి శంకరగిరి మన్యాలు పట్టించరు.

శ్రీగురుశక్తి ఎంత గొప్పదంటే... తనను తాకిన ఏ వస్తువునైనా బంగారం చేయగల పరశువేదివలె, తనను చేరిన శిష్యులను శ్రద్ధా విశ్వాసాలు భక్తితో, ఓర్పు-నిష్ఠలతో సేవించుకొనే శిష్యులను తనంతటి వారిగా తయారుచేయగల సిద్ధపురుషులు.

ధ్యానదృష్టి కలిగివానికి సోమరితనం ఉండదు. ప్రశాంత వాతావరణంలో ధ్యానయోగమందు మనం దివ్యమూర్తి కొరకై అన్వేషిస్తాము. ఆ నిశ్చలధ్యానం మన మనస్సును నిర్మలం చేస్తుంది.

ఫలాపేక్ష లేకుండ అనుసరించిన మానవుడు తప్పక దైవసాన్నిధ్యాన్ని పొందగలడు. సత్సంగములు, ప్రార్థన, సేవ, కరుణ, ధ్యాన నిష్ఠ, వినయ సంపద, సేవానిరతి, భగవత్సాక్షాత్కారానికి ప్రధాన సోపానాలు.



# ధ్యాన సాధన


నదికి ఆవలి ఒడ్డున నివసించే ఒక బ్రాహ్మణ పూజారికి ఇవతల ఒడ్డునుండి నది దాటి ఒక అమ్మ పాలు పోస్తూండేది. పడవ సర్వీసు సక్రమంగా లేకపోవటం వలన ఆవిడ నిత్యం సకాలంలో ఆ పూజారికి పాలందించేది కాదు. ఒక రోజున పూజారి ఆ అమ్మను రోజు పాలు ఆలస్యంగా పోస్తున్నందుకు కోపగించుకున్నాడు. అందుకు ఆ అమ్మ, “బాబూ ! నేనేమి చేసేది? రోజూ ఇంటినుండి పెందలకడనే బయలుదేరి వస్తాను. కాని నది ఒడ్డున పడవ ఆపడం వల్ల నేనక్కడే ఉండవలసివస్తుంది. నేను సకాలానికి రాలేక పోతున్నాను” అని బదులు చెప్పింది. అప్పుడా పూజారి “భగవన్నామం’ ఉచ్ఛరిస్తూ భక్తులు జీవనసాగరాన్ని సులువుగా దాటుతున్నారే? నీవా మాత్రం చిన్ననదిని దాటలేవా?” అని ఛలోక్తిగా అన్నాడు.

పాపం ! ఆ అమ్మ ఆ నదిని సులభంగా దాటు ఉపాయాన్ని తెలుసుకొని హృదయస్పందన చెంది ఆనందించింది. మరుసటి నాటి నుండి ఆ అమ్మ ఉదయం పెందలకడనే ఆ పూజారికి పాలు అందించటం ప్రారంభించింది. ఒకనాడు ఆ పూజారి ఆశ్చర్యచకితుడై ఆ ఆమ్మతో “నీవు రోజు పాలు ఏమి ఆలస్యం లేకుండా అందిస్తున్నావు. ఇది నీకు ఎట్లా సాధ్యమైంది?” అని అన్నాడు. నిష్కపటియైన ఆ అమ్మ ఆ పూజారితో ‘‘స్వామీ ! మీరు చెప్పిన విధంగా భగవన్నామం జపిస్తూ ఈ నదిని దాటగలుగుతున్నాను. నాకిప్పుడు పడవతో పనిలేకుండ పోయిం”దని చెప్పింది. ఆ పూజారి ఆ మాటలను నమ్మలేక నివ్వెఱపోయి ఆమెతో “నీవెలా ఆ నదిని దాటావో చూపించగలవా?” అని ప్రశ్నించాడు. ఆమె అతనిని తనతో తీసుకొని పొయి ఆ నదిపై నడవటం ప్రారంభించింది. ఆమె వెనుతిరిగి చూస్తే ఆ పూజారి అవస్థను గమనించి అతనితో, “స్వామీ ! మీ నోటితో భగవన్నామం ఉచ్ఛరిస్తున్నారు కదా ! అదే సమయంలో మీ బట్టలను నీటిలో తడవకుండా ప్రయత్నం చేస్తున్నారేమిటి? మీరు మనసారా భగవంతుని ధ్యానం చేస్తున్నట్లులే”దని పలికింది. దీని బట్టి అత్యద్భుతకార్యాలు సాఫల్యానికి భగవంతునిపై పరిపూర్ణ విశ్వాసం, తదేక ధ్యానమూలాధారాలని స్పష్టమౌతుంది.

మనశ్శాంతి లేనివాడు, చిత్తైకాగ్రత లేనివాడు, జ్ఞానేంద్రియాలను (పంచేంద్రియాలను) అదుపులో ఉంచుకోలేనివాడు, పాపచింతను వీడనివాడు, ఎన్నడు భగవంతుని చూడలేడు. చేరలేడు. అతడెంత మహామేధావి అయినా ఫలితం శూన్యం.

# శ్రీలలితా సహస్రనామములు(అర్ధసహితము)

(గతసంచిక తరువాత భాగం) – ***యల్లమిల్లిసరోజినిజోగారావు.*** హైదరాబాద్



**107.“ఓం తటిల్లతాసమరుచ్యై నమః”** : ఇడపింగళ మధ్యన వున్న సుషుమ్న అగ్నిమండలతేజముతో మేరుపు తీగను మించి మెరయుచూ, జీవ జనని సంజీవని – కుండలిని యోగమున సహస్రారకమలమున దర్శనమొసగును. “విద్యుల్లేఖేవ భాస్వరా” అని మంత్ర పుష్పంలో పరబ్రహ్మస్వరూపిణిని ఆరాధిస్తాము. కుండలినీయోగసాధన ద్వారా యోగులు, భువనభువనంబులెల్ల వెలుగు – జగజ్జననిని ఆత్మలో దర్శించి ధన్యులగును.

**108.“ఓం షట్చక్రోపరిసంస్థితాయై నమః”** : మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధి, ఆజ్ఞా షట్చక్రములపైన, వున్న సహస్రారకమలంలో కొలువైవున్న – శ్రీదేవికి నమస్కారము.

**109.“ఓం మహాసక్త్యై నమః”** : దేహత్రయము అశ్వరమని, చిత్కలాస్థానమున సాక్షిరూపిణికి, తనకు భేదం లేదని, తెలుపు జ్ఞానరూపిణి, మన యొక్క సంకల్ప వికల్పముల రహితము జేసి, సంశయ, సందిగ్ధనిర్మూలనగావించి,



మనకు, ఆత్మసమాగమునందు ఆసక్తి గల్గించు. శ్రీమహాసక్తకు ఆత్మాసాక్షాత్కార నమస్కారము.

**110.“ఓం కుండలిన్యై నమః”** : మూలాధారచక్రంలో మూడున్నర చుట్లు చుట్టుకొని, యుండు సర్పాకృతిగల కుండలినీ శక్తిరూపిణికి నమస్కారము. సుషుమ్న రూపమే తానై షట్చక్రముల మధ్య తిరుగుచూ ఆరోహణ అవరోహణము సేయు వక్రగతి గలుగు సర్పంరీతి, కండలినీ యోగ రూపిణి మూలాధార చక్రమున, సుషుప్త్యావస్థలో వుండును.

**111.“ఓం బిసంతంతుతనీయస్యై నమః”**: తామరతూడులోని, అతి సన్ననైన, సూక్ష్మమైన దారమువలె – పీతవర్ణముతో భాసిల్లు అతి సూక్ష్మస్వరూపిణికి నమస్కారము. “పీతాభాస్వత్యరూపమా” అని శ్రుతి వాక్కు. అతిశక్తివంతమైన కుంలినీ శక్తి రూపిణి శ్రీచక్రసంచారిణిని వర్ణించెను.

**112.“ఓం భవాన్యై నమః”** : భవుడనగా శంకరుడు. భవుని రాణి భవాని. సారరహితమైన ఈ సంసార సాగరము దాటించు, భవతారిణి. సారహీన సంనావయైన శ్రీజ్ఞానసుందరి జగత్కారిణి భవాని. భవసాగరమును దాటించు పరమపావని, భవాని శ్రీ భవానికి నమస్కారము.

**113.“ఓం భావనాగమ్యాయై నమః”** : మనం, భావమునందు జగన్మాతను ఏ రూపంతో ధ్యానిస్తామో ఏ నామంతో ధ్యానిస్తామో అదే రూప నామములతో మన భావమునందు స్థిరమై అనుగ్రహించును. ఇచట భక్తి ప్రధానం. భక్తి, ఆర్తి శరణాగతి నిరంతర ధ్యానములే ముఖ్యము. సగుణ పూజ తామసం, మానస పూజ రాజసం, నిర్మల, నిశ్చల, నిరహంకరాముని చేయు ఆత్మపూజ సాత్వికము. ఇదిము ఉత్తమమార్గము. ప్రతిఫలమాసించక, నిష్కామ పూజ చేయువారికి భావములో శ్రీభావనాగమ్యయై నిత్య సత్యమై భాసిల్లును. ❑

(సశేషం)

ఓం గణేశాయ నమః

# అష్టగణపతి క్షేత్రములు

*(గత సంచిక తరువాయి భాగము)*

## 8. శ్రీ మహా గణపతి– రంజన్‌గామ్



శ్రీవరద వినాయక కథలో గృత్సమదుడు తన తల్లిని శపించి, ఆమెచే ప్రతిశాపమునుపొందినట్లు చదివితిమి. "మహా బలపరాక్రమవంతుడు, త్రిలోక కంటకుడు, క్రూర రాక్షసుడు అగు కుమారుడు జన్మించుగాక" అని ఆమె శాపము. ఇది యిట్లుండగా, గృత్సమదుడు అత్యంత భక్తితో విఘ్నేశ్వరుని ధ్యానించి, ఆతనిని ప్రసన్నుని చేసికొనెను. వినాయకుని వరప్రసాదమువలన, అతడు మునులలో పరమశ్రేష్ఠుడైనాడు. ఒకనాడు ఏకాగ్రతతో వినాయకుని జపమునందు మునిగి ఉండగా, అతనికి పర్వతములు సైతము అదిరి పడేటంత పెద్దధ్వనితో ఒక తుమ్ము వచ్చినది. తత్‌క్షణమే, తన ఎదుట ఇక బాలకుడు కనిపించెను. మునిశ్రేష్ఠుడు, "నీవు ఎవరు?" అని అడుగగా ఆ బాలకుడు, "నీ తుమ్ములో జన్మించినాను. కనుక నీవే నాకు తల్లివి, తండ్రివి" అని జవాబు చెప్పెను. ఆ బాలకుని మాటలకు ఆశ్చర్యపడిన ముని అతని శక్తియుక్తులకు సంతసించి, 'గణానాంత్వా' అనే గణపతి మంత్రమును ఉపదేశించెను. ఈ గణపతి మంత్రమును, ఆ బాలుడు 5 వేల సంవత్సరములు జపించెను. గణపతి సాక్షాత్కరించి, వరములను కోరుకొనుమనెను. "మూడు లోకములలోను నాకు ఎవరు ఎదురు ఉండరాదు.



దేవతలు నాకు వశులై ఉండాలి. నేను దేనిని సంకల్పించినను అది తత్‌క్షణమే సిద్ధించాలి, ఇహములో సుఖములనుభవించి పరములో మోక్షమును పొందాలి" అను వరములను అతడు గణపతిని కోరెను. గజాననుడు ఆ వరములను ప్రసాదించెను. కామగమనముగల మూడు పురములను బంగారముతో, వెండితో, ఇనుముతో నిర్మించి అతనికిచ్చెను. ఆ పురములు ఒక్క శంకరునిచేత తప్ప ఎవరిచేతను ఛేదింపబడవు. నీకు త్రిపురాసురుడు అను ఖ్యాతి లభించును. శంకరుడు తన ఏకైక బాణముతో ఈ మూడు పురములను ఛేదించినప్పుడు, నీకు ముక్తి లభించును" అని వరములను అనుగ్రహించెను. త్రిపురాసురుడు గజాననుని వలన పొందిన శక్తులతో, భూమండలమును అంతయు ఆక్రమించెను.

తరువాత అతడు దేవలోకముపై దండయాత్రచేసెను. ఇంద్రుని ఓడించెను. అమరావతిని తనరాజ్యముగా చేసికొనెను. అచ్చటినుండి, త్రిపురుడు బ్రహ్మలోకమునకు దండెత్తి వెళ్ళెను. బ్రహ్మ, విష్ణువు యొక్క నాభి కమలములో లీనమైపోయెను. విష్ణువు కూడ ఆ రాక్షసునికి కనపడకుండా క్షీరసముద్రమునకు చేరెను. ఈ విధముగా అతడు బ్రహ్మలోకమును, విష్ణులోకమును (రెండిటిని) ఆక్రమించుకొనెను. త్రిపురాసురుడు బ్రహ్మలోకమునకు తన పెద్దకుమారుడైన ప్రచండుని, విష్ణులోకమునకు తన రెండువ కుమారుడైన చండుని, అధిపతులుగా నియమించెను.

ఇక శివలోకమును ఆక్రమించుకొనుటకై అతడు కైలాసమనకు వెళ్ళెను. శివుడు కూడా కైలాసమును వదలి మంథర పర్వతమునకు చేరెను. తరువాత, రసాతలము, సప్త పాతాళ లోకములు త్రిపురాసురుని వశమైనవి.

ఈ కారణమున వ్యాకులత చెందిన సమస్త దేవతలకు నారద మహర్షి గణేశానుగ్రహము పొందుటయే సరియైన మార్గమని ఉపదేశించెను. అప్పుడు దేవతలందరు అత్యంత భక్తితో పరిపూర్ణ శరణాగతితో సంకటమోచన గణేశ్వరుని ప్రార్థించిరి.

గణేశుడు ప్రత్యక్షమై, 'ఆ రాక్షసుని బాధనుండి నివారించెదు'-అని దేవతలకు అభయమిచ్చెను. వారు ప్రార్థన చేసిన స్తోత్రమును "సంకటనాశన గణపతిస్తోత్రము" అను పేరుతో శాశ్వతముగా నిలుచునని ఆనతిచ్చెను. ఈ స్తోత్రముతో ఎవరు ప్రార్థించెదరో, వారికి ఎట్టి సంకటములు కలుగవనియు, సమస్త కోరికలు సిద్ధించుననియు వరమునిచ్చెను.

ఈ విధముగా వరములనిచ్చిన గజాననుడు ఒక బ్రాహ్మణ వేషముతో త్రిపురాసురుని సన్నిధికి చేరెను. త్రిపురాసురుడు ఆ బ్రాహ్మణుని శ్రద్ధగా భక్తితో పూజించి, ఏదైనను ఒక వరమును కోరుకొమ్మనెను. ఆ బ్రాహ్మణుడు, కైలాసములో శివుని యొద్ద ఉన్న చింతామణి గణపతి మూర్తి కావలెనని కోరెను. ఆ కోర్కె తీర్చుటకై త్రిపురాసురుడు శంకరునితో యుద్ధము చేసి ఓడించి, ఆ మణిని గైకొనెను. కాని అందులకు త్రిపురాసురుని చేతిలో ఆ చింతామణిమూర్తి మాయమయ్యెను. త్రిపురాసురుడు చాల ఖిన్నుడయ్యెను.

శంకరుడు త్రిపురాసురునిచే ఓడింపబడెను. అప్పుడు నారదుడు శివునితో, 'గణేశుని పూజించి ఆయన అనుగ్రహము పొందక పోవుటచేతనే ఆ పరాజయము నీకు సంభవించినది, కనుక గణేశుని పూజించి, అతని అనుగ్రహమును సంపాదించుకొనుము.' అని చెప్పెను. అదికాక, వినాయకుడు త్రిపురాసురునకు ఇచ్చిన వరము ప్రకారము, ఆరాక్షసుడు శివునిచేతనే



వధింపబడునని గూడ శంకరునకు తెలియచేసెను. అప్పుడు శంకరుడు 100 సంవత్సరముల కాలము ఏకాగ్రతతో గణేశుని గూర్చి తపస్సు ఆచరించెను. విఘ్నేశ్వరుడు ప్రసన్నుడై ఒక బాణమునిచ్చి తన సహస్రనామములను శివునకు ఉపదేశించెను. శివుడు ఆ సహస్రనామములను జపించి, త్రిపురాసురునిపై యుద్ధమునకు బయలుదేరెను. అప్పుడు శంకరుడు పృథ్విని రథముగాను, సూర్యచంద్రులను చక్రములుగాను, బ్రహ్మను రథసారథిగాను, వేదములను గుఱ్ఱములు గాను, మేరువును ధనస్సుగాను, విష్ణువును బాణముగాను చేసికొనెను. శంకరుడు వినాయక-అష్టకమును పఠించి, విఘ్నేశ్వరుని అభయముపొంది, విష్ణువు యొక్క అంశతో గూడిన పాశుపతాస్త్రమును త్రిపురాసురునిపై ప్రయోగించెను. ఆ అస్త్రముతో త్రిపురములు దహింపబడగా త్రిపురాసురుడు మరణించెను.అతని శరీరమునుండి ఒక తేజస్సు వెలువడి శంకరునిలో లీనమాయెను. ఆ విధముగా త్రిపురాసురుడు మోక్షమును పొందెను. ఆ రోజు కార్తిక పౌర్ణమి. ఈ విజయమునకు కారణుడైన విఘ్నేశ్వరుని విగ్రహమును స్వయముగా శంకరుడే ఆ క్షేత్రమునందు ప్రతిష్ఠించెను. ఆ మూర్తియే ఈ మహాగణపతి. ఈ స్థలమే రంజన్ గామ్.

ఈ కథ గణేశ పురాణములో 38 నుండి 47 వరకుగల అధ్యాయము లలో వివరింపబడినది. ఈ కథను చదివిన వారికి, వినిన వారికి కోరిక లన్నియును సిద్ధించును.

**గమనిక :** రంజన్ గామ్ పూణే-అహమద్ నగర్ రహదారిలో పూణేనుండి 50 కిలో మీటర్ల దూరములో ఉన్నది.

# మహాత్ముల సూక్తులు

సేకరణ : **అనిత,** హైద్రాబాద్

- ఏ జీవియైనా మిమ్ములను సమీపిస్తే అసహ్యించుకొనగూడదు. అమర్యాద చూపకండి. వారిని సాదరంగా పలకరించి తగిన రీతిలో మర్యాద చూపండి.

- ఆకలిగొన్నవారికి అన్నము, దప్పిక గొన్నవారికి దాహము, విశ్రాంతి నీడ కోరినవారికి మీ వరండా, వస్త్రాలు లేని నిరుపేదలకు వస్త్రాలు దానంచేస్తే శ్రీమహావిష్ణువు పరమానందభరితుడు కాగలడు.

- మీరెన్నుకొన్న గురువుగారి మహిమలను కించ పరచక, ఇతర గురువు లెంత మహిమోన్నతవారలయినను, అచంచల ఆత్మవిశ్వాసముతో నీవు నమ్మిన సద్గురునే స్మరిస్తూ ఆరాధించండి.

- ద్వేషపూరిత హృదయానికి సంతృప్తి కలుగదు. ద్వేషాగ్ని కార్చిచ్చు వంటిది. శాస్త్రాధ్యయనం వలన మానవుడు మేధావి కాలేడు. మహాత్ముల దైనందిత కార్యములందు సన్నిహితాన్ని పెంపొందించుకొనగలిగినవాడే జ్ఞానియై రాణించగలడు.

- తన జీవితమే సర్వస్వమని భావించేవాడు తన జీవితపు విలువలను పొందలేడు. చేరలేడు. తన జీవితాన్ని జగన్నాధునికి అంకితం చేసినవానికి జనన మరణ బంధాలనుండి విముక్తి, పరమాత్ముని దర్శనభాగ్యం కలుగుతుంది.



- ఆత్మజ్ఞాన సాధనకు క్రోధము భయంకర శత్రువు. పదునైన కత్తి. ఎంత ఆత్మనిగ్రహము దాతృత్వము కలిగిఉన్నా, కోపిష్టుల తపస్సు సర్వాన్ని ధ్వంసం చేస్తుంది. అందువలన కోపాన్ని విడనాడుట భక్తుని ప్రధమ కర్తవ్యం.

- మన మనస్సును, మన బుద్ధిని పరమేశ్వరుని చింతనపై నిలుపలేనంత కాలం, ధ్యానయోగమందు నీ మనస్సును సర్వేశ్వరునిపై కేంద్రీకరించ లేనంతకాలం, మన బాహ్యసాధనాలన్నీ నిష్ప్రయోజనకరాలే.

- సత్యము పాటించడానికి, దైవదర్శనానికి మనం అనేక కష్టాలు అనుభవించవలసి వుంటుంది. అది మానవునికి ప్రఖ్యాతిని కలిగించే విశిష్ట పరిస్థితి. అది కష్టాలు బాధలు భరించగలిగితే మనం దైవసాన్నిధ్యానికి తప్పక చేరగలం.

- జగన్నాటక సూత్రధారి మనలను ఒక్కొక్కసారి అనుకూల పరిస్థితులం దుంచి సుఖాన్ని కలిగిస్తాడు. మరొకసారి మనలను ప్రతికూల పరిస్థితులందుంచి దుఃఖాన్ని కలిగిస్తాడు కూడ. అయినా మన ఒడుదుడుకులకు ఏ మాత్రం చలించక “అంతా మనమంచికే” అని భావించాలి.

- భగవంతుడు మనస్థైర్యాన్ని పరీక్షించే నిమిత్తం కష్టాలను కలిగిస్తాడు. మనం వానిని అధిగమించాలి. బలహీనుడు కష్టాల పరంపర నెదుర్కొనలేక నలిగిపోతాడు. ఆత్మబల సంపన్నుడు మనో నిబ్బరంతో వాని నెదుర్కొని విజయం సాధిస్తాడు. దృఢవిశ్వాసం మానవుని బలవంతునిగా మలచగలదు. అందువలన నీవు ఆత్మవిశ్వాసాన్ని కలిగి, ధైర్యశాలివై నీ విధులను నిర్వహించాలి.

# గురు హృదయం

అజ్ఞానమనెడి చీకటిని పారద్రోలి సుజ్ఞానమనెడి కాంతులను విరజిమ్మెడి వారలే గురువులు. గురువులేని విద్య గుడ్డివిద్య. ముఖ్యంగా ఆధ్యాత్మికజ్ఞానం గురువు లేకుండా లభించడం అసాధ్యం. పూజలు, జపాలు, ధ్యానము, యోగశక్తి వంటి విద్యలకు తగిన గురువు లేకుండా పుస్తకాల ద్వారా పొందటమనేది మిడిమిడి జ్ఞానమే అవుతుంది.

మంత్రోపదేశం ఎలా వుండాలి? గురువుల విశిష్టత ఏమిటి? గురువులతో శిష్యులకు, సిద్ధపురుషులతో సాధకులకు కలుగు అనుభూతులు, అనుభవాలు ఎట్టివి? సత్యదర్శనము, ప్రత్యక్షంగా దైవానుభూతులు పొందటం గురించి పునర్జన్మలు, గృహస్థుడిగా యోగసాధన, సత్యాసత్యాలు, పాపపుణ్యాలు, దైవశక్తి, దుష్టశక్తి, గురుశరణు, జీవుడు, వ్యామోహం, కాలము, భగవంతుని లక్షణములు సద్గురువు ద్వారానే పొందాలి.

దేవుడు కోపిస్తే గురువు రక్షిస్తాడు. సద్గురువులే కోపించిననాడు దేవుడు కూడా రక్షించలేడట.

ద్రవ్యము కలవారు దానగుణం కలిగియుండుట వలన కర్మబంధముల నుండి విముక్తి నొందవచ్చును.

## ధర్మంచర

**బ్రాహ్మీ ముహూర్తము :** సూర్యోదయానికి ముందు 3 ఘడియలకాలము. 1 ఘడియ=24 ని॥లు. దేవతలు సంచరించు బ్రహ్మముహూర్తమున చేసిన జప, పూజాదికాలు అనేక రెట్ల ఫలితము నిచ్చును.

**శ్రుతివాక్యము :** నీటిలో అగ్ని వుంటుంది. కనుక, నీటి యందు మల, మూత్రములను విసర్జించరాదు. ఉమ్మివేయరాదు. వస్త్రం లేకుండా మొండిమొలతో స్నానం చేయకూడదు.

గోవు, వేదం చదువుకున్న బ్రాహ్మణులు, ఇరువురు సాధారణ బ్రాహ్మణులు, భార్యాభర్తలు, గురుశిష్యులు వీరి మధ్యలో నుండి వెళ్ళరాదు.

**దేవతలకు ఇష్టమైనవి :** విష్ణువునకు అలంకారము, శివునకు అభిషేకము, సూర్యునకు నమస్కారము ఇష్టమైనవి.

**సేకరణ :కె.ఆర్. విజయ్‌కుమార్,**
మదనపల్లి- 517 325





# లేఖలు

ఈ మధ్య మా బంధువుల ద్వారా శ్రీమాన్ రావూజీ గారి గురించి తెలిసినది. నేను రెండు మూడుసార్లు ఫోన్ చేసినాను. ఫోన్ కనెక్షన్ అవగానే వినిపించే రింగుటోన్, ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి అని శ్రావ్యమైన సంగీతము వినిపించును. ఇది వినగానే మనకు బాహ్య ప్రపంచం మర్చి ఒళ్ళు పులకరించి షిరిడీ బాబా మనకు మదిలో మెలుగును. యిక పూజ్యరావూజీ గారి పలకరింపు, చాలా యింపుగా చాలా సౌమ్యముగా ఉండును. సాయి స్మరణ మదిలో కలుగును. పలకరింపు కూడా సాయి నామమే 'సాయిరామ్'. మనం షిరిడీలో వున్నట్లుగా ఆనందం పొందెదము. ఎన్నిసార్లు ఫోన్ చేసినా శాంతంగా ఆ మధురమైన పలుకరింపే. మనం మోహమాటం పడి మీకు ఏ విధమైన యిబ్బంది కలుగుటలేదు కదా అని అడిగితే ఆయన ఇచ్చే సమాధానం బాబా నన్ను మీ సేవ గురించే నియమించినారు. మీరు ఎన్ని సార్లయినా ఫోన్ చేయవచ్చును. నాకు ఏమాత్రము ఇబ్బంది లేదు అని సమాధానమిస్తారు.

శ్రీరావూజీగారు ఒకసారి రమ్మనమని ఆహ్వానించినారు. ఆయన ప్రార్థన మందిరంలో ఎక్కడ చూసినా బాబా కనబడతారు. ఎంతో కళ ఉట్టిపడే ఫోటోలు అక్కడ ఉన్నంతసేపు సాయినామస్మరణ కల్గును. షిరిడీలో ఉన్న భావము కలుగును.

ఈయన చాలా నిరాండబర జీవి. ప్రస్తుత ప్రపంచంలో బాబాలు బాహ్య అలంకరణలకే ప్రాముఖ్యత యిచ్చెదరు. వీరు ఏ విధమైన బాహ్య అలంకారం ఉండదు. ఎప్పుడు కూడా మీ కష్టాలను, ఆరోగ్యపరిస్థితిని నాకు చెప్పండి. నేను యిక్కడ ధ్యానం చేసెదను. మీరు యిక్కడకు రావలసిన అవసరం లేదు. ఎంత రాత్రయినా సంకోచించకుండా ఫోన్ చేయవచ్చును. ఆయనకు విదేశాలనుండి కూడా ఫోన్‌లు వచ్చును. శ్రమ అనుకోకుండా ప్రతి ఒక్కరి గురించి ధ్యానము చేసెదరు. బాబా ఊధి పోస్టులో పంపి, దానిని ఏ విధముగా ధరించాలి ఎలా కూర్చోవాలో

వివరించెదరు. ఆ విధముగా ఆయన చెప్పిన రోజులలో శ్రద్ధగా ఊధి ధరించి భక్తితో నిష్టగా బాబా స్మరణ చేసిన, భక్తులకు పూర్తి ఆరోగ్యం చేకూరును. ఈ హీలింగ్ జరిగిన 5 నిముషాలు మనము కళ్ళు మూసుకుని, ధ్యానం చేయవలెను. యిది పూర్తి అయిన తరువాత షిర్డీబాబా చెప్పినట్లు రెండు రూపాయలు బాబా ఫోటో దగ్గర గాని, పూజామందిరంలో గాని పెట్టమని చెప్పెదరు. యిద్దరికి అన్నదానం బాబా బోధించిన విధముగా చేయమని చెప్పెదరు. రావూజీగారు భక్తులనుండి ఏ విధమైన దక్షిణ అడుగరు. బాబా బోధించిన విధముగా సమాజ సేవ చెయ్యమని చెప్పెదరు. యిటువంటి నిరాడంబర వ్యక్తిని చూడము. ఈయన కూడా అన్నదానం, సమాజసేవకే జీవితము అంకితము చేసినారు. ఈయనను బాబాజీ అని పిలికిన ఎంతో సవ్యముగా ఉండును. ఆయన తన జీవితము భక్తుల కష్టాలు, అనారోగులకు పూర్తిగా రోగబాధనుండి విముక్తి కలిగించుటకు అంకితం అయ్యారు.

– తలంరాజు శేషగిరిరావు, హబ్సిగూడ, హైద్రాబాద్, ఫోన్ 27170 338



**"సేవయను ఈ ఉన్నతాదర్శము ననుసరించి మీరు మీ జీవితములను నిర్మించుకొనవలెను. దీని ద్వారా తక్కిన ఆ ధర్మములన్నియు క్రమముగా జీవితమునందు ప్రకటితము కాగలవు."**

**"ఎల్లప్పుడు ఉల్లాసముగా చిరునవ్వుగల ముఖముతో నుండువాడు, ప్రార్థనలు చేయువానికంటే సులభముగా భగవత్సాన్నిధ్యమును పొందగలడు"**

**- శ్రీవివేకానంద స్వామిజీ**

Printed Published and owned by A.V.Ramana Rao at 1-5-62/2/B Maruthi Nagar, Hyderabad - 500 060. Printed at Sri Kala Printers, 1-1-781/B/4, Gandhi Nagar, Hyderabad - 80 Ph : 27611864, on behalf of Roopa Art Centre, Keshav Memorial Lane, Narayanaguda, Hyderabad - 029. Editor - **A.V.Ramana Rao**